ప్రపంచ కార్మికులారా, ఏకముకండి!

В. И. ЛЕНИН

О МИРНОМ СОСУЩЕСТВОВАНИИ

На языке телугу

వి. ఇ. లెనిన్

శాంతియుత సహజీవనం

"ప్రగతి" ప్రచురణాలయం
మాస్కో

సంకలనము, పీఠిక: సి. లెటేయ్‌జెన్

అనువాదం: వుప్పల లక్ష్మణరావు

విషయసూచిక

పీఠిక

సోవియట్ రాజ్యం ఆవిర్భవించిన తొలి రోజునుండీ సోషలిస్టు దేశం పెట్టుబడిదారీ దేశాలతో శాంతియుత సహజీవనమే దాని వైదేశిక విధానపు సాధారణ పంథాగా వుంటూంది.

శాంతియుత సహజీవన విధానం అంటే ఏమిటి?

ఈ భూగోళంపై విభిన్న సామాజికార్థిక వ్యవస్థలుగల దేశాలు ఏకసమయంలో మనగల్గుతాయని ఒప్పుకోవడం; పురాతన పెట్టుబడిదారీ విధాన రాజ్యాల సరసనే నూతన సోషలిస్టు రాజ్యాలు అవతరించి, అభివృద్ధి చెందడమూ, వీటి మధ్య శాంతియుత ఆర్థిక సంబంధాలనూ, క్రమమైన వాణిజ్య సాంస్కృతిక సంబంధాలనూ స్థాపించేందుకు వీలుంటుందనీ, స్థాపించి తీరాలనీ, అంతేకాని వీటి మధ్య ప్రత్యక్ష యుద్ధ సంబంధం మాట అసలు ఎత్తడమే అనవసరమవగా, ప్రచ్ఛన్న యుద్ధ సంబంధం మాత్రం కాదని ఒప్పుకోవడం; రాజ్యాల మధ్య సంభవించే అన్ని విరోధాలనూ వివాదాలనూ యుద్ధమార్గాన కాకుండా, కేవలం సంప్రతింపుల మార్గాన్నే పరిష్కరించుకుని తీరాలనీ ఒప్పుకోవడం; ఏ సామాజిక-రాజకీయ వ్యవస్థ హెచ్చు ప్రగతిశీలమైనదీ, ప్రజలకు అత్యున్నత స్థాయి జీవనప్రమాణాన్ని సుస్థిరం చేసేదీ అనే ప్రశ్న, ఒక దేశం, లేదా కొన్ని దేశాలు కలిసిన ఒక కూటమి వేరొక దేశంపైన, లేదా కొన్ని ఇతర దేశాల కూటమిపైన సాయుధమైన దాడి వలన కాకుండా ఆర్థిక, సాంస్కృతిక పోటీ వల్లనే పరిష్కారమవాలని ఒప్పుకోవడం.

ఇదీ నలభై ఐదేళ్ల పైచిలుకు కాలంలో సోవియట్ ప్రజ, దాని ప్రభుత్వమూ సుసంగతంగానూ దృఢంగానూ అనుసరించినట్టీ ఇప్పుడూ అనుసరించుతూన్నట్టీ విధానంలోని మూలవిషయం.

శాంతియుత సహజీవన విధానాన్ని ప్రకటించినదీ నిరూపించినదీ లెనిన్.

అక్టోబరు విప్లవం తరువాతి సంవత్సరాల్లో లెనిన్ రచించిన వ్యాసాలనూ పాంప్లెట్లనూ, వైదేశిక విధానంపై ఆయన ఇచ్చిన ఉపన్యాసాలనూ ఇంటర్వ్యూలనూ మనం చదివిన

ట్టయితే వీటన్నిటిలోనూ శాంతియుత సహజీవన భావం ఒక ఎర్రని పోగులా వుండడం మనకు అవుపడుతుంది. సోవియట్ రాజ్యం ప్రభవించిన మొట్టమొదటి సంవత్సరాల్లోనే సుస్థిరమూ శాశ్వతమూ అయిన శాంతిని స్థాపించేందుకూ, పెట్టుబడిదారీ విధాన రాజ్యాలతో శాంతియుత సహజీవన పరిస్థితులను నెలకొల్పేందుకూ లెనినూ, ఆయన అధినేతగా వుండిన ప్రభుత్వమూ విశ్వ ప్రయత్నాలు చేయడం జరిగింది. కాని ఆ కాలంలో బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికా సంయుక్త రాష్ట్రాల పాలకవర్గాలు తీసుకున్న స్థానం కారణంగా ఆ ప్రయత్నాలు ఫలించలేదు. ఈ వర్గాలు శాంతియుత సహజీవనాన్ని వాంఛించనే లేదు, విన్‌స్టన్ చర్చిల్ తన స్మృతులలో రాసినట్టుగా, "పురిటిలోనే బోల్‌షెవిక్ రాజ్యం పీక నులిమివేయడానికే" అవి ఎత్తువేశాయి; ఈ ఎత్తుకు అనుగుణ్యంగానే కొన్ని ఏళ్ల తరబడిగా బాల్యంలోనే వున్న సోవియట్ రిపబ్లిక్‌పై సాయుధ దాడులను అవి సంఘటితపరచాయి. ఇంకా బాల్యంలోనే వున్నట్టీ, ఆర్థికంగానూ సైనికంగానూ బ్రహ్మాండశక్తిని కల్గిన అంటాంట్ రాజ్యాలకంటె ఇంకా ఎంతో బలహీనంగానే వున్నట్టీ సంవత్సరాల్లోనే సోవియట్ దేశంపై చర్చిల్, క్లెమాన్‌సో, విల్సన్, వారి తాబేదార్లూ సాగించిన యుద్ధచర్యలన్నీ ఎంత సిగ్గుచేటుగా అంతమొందాయో అందరకూ తెలిసినదే.

పాఠకులకు సమర్పించుతూన్న ఈ పుస్తకంలో శాంతియుత సహజీవన సమస్యపై లెనిన్ రాసినదీ చెప్పినదీ యావత్తూ చేర్చనే లేదు. ఈ పుస్తకం చిన్నదే అయినప్పటికీ, ఇందులో కూర్చిన రచనలు ప్రపంచంలో ప్రప్రథమంగా ఆవిర్భవించిన సోషలిస్టు రాజ్యపు అధినేత శాంతియుత సహజీవన విధానాన్ని అత్యవశ్యం అవలంబించాల్సినదిగా ఎందుకు భావించినదీ, ఈ విధానం నిర్వర్తించాల్సిన మౌలిక కర్తవ్యాలను ఏ విధంగా ఆయన సూత్రీకరించినదీ, విభిన్న సామాజిక-ఆర్థిక వ్యవస్థలుగల రాజ్యాల మధ్య సంబంధాలలో శాంతియుత సహజీవన సూత్రాలకై సాగించే పోరాటాన్ని ఎందుకంతటి అనంత ప్రాముఖ్యతను కల్గిన కార్యంగా ఆయన భావించినదీ స్పష్టమైన చిత్రాన్ని మనకు ప్రదర్శిస్తాయి.

* * *

ఈ సంకలనం ప్రసిద్ధివడసిన "శాంతిని గురించి ఉత్తర్వు"తో ప్రారంభమవుతూంది.

1917 అక్టోబరు 26 (నవంబరు 8)వ, రాజ్యాధికారశక్తి కార్మిక కర్షకుల చేతిలోకి మారిన మొదటి రోజున, లెనిన్ ఇచ్చిన నివేదికపై అఖిల రష్యా సోవియట్ల మహాసభ శాంతిని గురించి ఉత్తర్వును అనుమతించింది; యుద్ధవిరమణ సంధిని తక్షణమే కుదుర్చుకొనవలసినదిగానూ, శాంతి స్థాపనకై సంప్రతింపులను ప్రారంభించవలసినదిగానూ యుద్ధం సాగించుతూన్న అన్ని దేశాల ప్రజలకూ ప్రభుత్వాలకూ ఈ ఉత్తర్వు విజ్ఞప్తి చేసింది. ఈ ఉత్తర్వు సర్వప్రపంచానికీ రేడియో ప్రసారంద్వారా అందజేయబడింది.

రక్తధారలను ప్రవహింపజేసిన ఆ ప్రపంచ యుద్ధం — వలస దేశాలనూ, ప్రభావ మండలాలనూ పునః విభజించుకుందుకై శత్రుకూటాలు రెండింటి మధ్యనూ ఆ యుద్ధం— నాలుగేళ్లపాటు సాగింది. రష్యా ఫ్రాన్సు దేశాల యుద్ధక్షేత్రాలలోనూ, జర్మనీ ఆస్ట్రియా-హంగేరీ దేశాల యుద్ధక్షేత్రాలలోనూ, టర్కీ ఇటలీ దేశాల యుద్ధక్షేత్రాలలోనూ లక్షలాది ప్రజలు ప్రాణాలుకోల్పోతున్నారు, యుద్ధం సాగించుతూన్న దేశాల ఆర్థికవ్యవస్థ కుప్పకూలి పోతూంది, ఉత్పత్తి పడిపోతూంది, ఆహారవస్తువులు తరిగిపోతున్నాయి, ఆకలి పస్తులు మొదలయాయి. సామాన్య ప్రజల బాధలు బ్రహ్మాండంగా పెరిగిపోయాయి, ఇక సర్వులూ — రష్యన్లూ, జర్మన్లూ, ఇటాలియన్లూ, బ్రిటిష్‌వాళ్లూ, ఒకరేమిటి యుద్ధంలో చిక్కుకున్న ప్రజలందరూ ఒకేఒక కోర్కెతో, సర్వాసహ్యమైన ఈ యుద్ధం అంతంకావాలి, శాంతి రావాలి అనే కోర్కెతో, వేధించుకుపోయారు.

ఈ ప్రజాసంకల్పాన్నే లెనిన్ రూపొందించిన "శాంతిని గురించి ఉత్తర్వు" వ్యక్తం చేసింది.

"బలోపేతములూ భాగ్యవంతములూ అయిన జాతులు తాము జయించినట్టి బలహీనులైన ప్రజలను తమలో తాము ఎలా పంచుకోవడమనే" వివాదాంశాన్ని కేవలమూ పరిష్కరించుకుందుకే సాగుతూన్న ఈ యుద్ధాన్ని "మానవాళిపట్ల ఒడిగట్టిన అపరాధాలలోకల్లా మహాపరాధంగా" సోవియట్ ప్రభుత్వం పరిగణించుతూందని ఈ ఉత్తర్వు ప్రకటించింది. ధర్మబద్ధమైనట్టి, ప్రజాస్వామికమైనట్టి శాంతిని, అనగా అన్యాక్రమణలు లేనట్టి, పరదేశీయ భూభాగాల బలాత్కార స్వాధీనం లేనట్టి, బలహీన స్థితిలో వున్న ప్రజల బలవంతపు విలీనీకరణం లేనట్టి, కప్పముల చెల్లింపులు లేనట్టి శాంతిని తక్షణమే కుదుర్చుకోవలసిందిగా యుద్ధం సాగించుతూన్న ప్రజలందరికీ సోవియట్ ప్రభుత్వం విజ్ఞప్తిచేసింది. ఈ షరతులను ఒక అంతిమప్రతిపాదన రూపంలో తాను సూచించడం లేదనీ యుద్ధం సాగించుతూన్న దేశాల్లో ఏ దేశమైనా సరే మరే ఇతర శాంతి ప్రతిపాదనలను సూచించినా సరే వాటిని పరిశీలించేందుకు తాను సిద్ధంగా వున్నాననీ సోవియట్ ప్రభుత్వం ప్రకటించింది.

ఈ విధంగా చరిత్రలో ప్రప్రథమంగా ఒక రాజ్యం అధికారయుతంగా ప్రకటించి, సుసంగతంగా అనుసరించిన విధానంగా రూపొందినట్టి శాంతియుత సహజీవన విధానంయొక్క మౌలిక సూత్రాలు "శాంతిని గురించి ఉత్తర్వు"లో పొందుపరచడం జరిగింది. నూతనంగా ప్రభవించిన సోషలిస్టు రాజ్యం యుద్ధం కోసం కాకుండా శాంతి కోసం, సుస్థిరమూ శాశ్వతమూ అయిన శాంతి కోసం నిలబడుతుందనీ, ఎట్టి దురాక్రమణ లక్ష్యాలు గానీ, రాజ్యకబళన లక్ష్యాలుగానీ దానికెన్నడూ లేవనీ, ఉండడానికి అవకాశమే లేదనీ, అన్యాక్రమణ రాజ్య విస్తరణ విధానానికి అది బద్ధశత్రువనీ, బలహీన స్థితిలో వున్న ప్రజల భూభాగాలను కాజేసే

11

దురుద్దేశంతో సాగించే ఏ యుద్ధమైనా సరే అక్షార్హమైన నేరంగానే అది పరిగణించుతుందనీ, ప్రజలకు తెలియకుండా దాచివుంచబడిన ఒడంబడికలలో పరప్రజలను జయించడమునకు సంబంధించినట్టి దారిదోపిడి వ్యవహారాలను కుదుర్చుకునే ఒప్పందాలు వుంటాయి కనుకనే రహస్యపు దౌత్యతంత్రానికి స్వస్తిచెప్పాలని అది ప్రతిపాదించుతూందనీ సర్వప్రజలకూ ప్రభుత్వాలకూ "శాంతిని గురించి ఉత్తర్వు" తెలియజేసింది. ఈ విషయంలో సోవియట్ ప్రభుత్వం తానే మొదటి ఉదాహరణను ఇచ్చింది — రహస్యపు దౌత్యతంత్రానికి స్వస్తిచెప్పి, జారిస్టూ, తాత్కాలిక ప్రభుత్వాలు చేసుకున్న రహస్య సంధులలో అన్యాక్రమణలను గూర్చి వున్న అన్ని నిబంధనలూ "నిర్నిబంధంగా, తక్షణమే రద్దు చేయబడినట్టు" ప్రకటించి, అందుతో పాటే రహస్యపు ఒడంబడికల ప్రచురణకు వెంటనే పూనుకుంది.

ఈ విధంగా అంతర్జాతీయ రంగంలో తాను చేసిన మొట్టమొదటి ప్రకటనలోనే సోవియట్ ప్రభుత్వం తన వైదేశిక విధానంలోని ప్రజాస్వామిక, శాంతికాముక సూత్రాలను సూత్రీకరించింది.

ప్రపంచ యుద్ధంలోనుంచి బయటపడేందుకని వాస్తవికమూ, అత్యంత సరళమూ మానవతాశీలమూ అయిన మార్గాన్ని, ప్రజలు అనుభవించుతూన్న బాధలను అంతంచేసేటట్టి మార్గాన్ని, ప్రతిపాదించిన "శాంతిని గురించి ఉత్తర్వు" పట్ల సామ్రాజ్యవాద రాజ్యాలు ఎట్టి వైఖరిని ప్రదర్శించాయి?

సోవియట్ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తికి అవి ఎట్టి జబాబూ ఇవ్వలేదు సరేకదా, యుద్ధాన్ని కూడా కొనసాగించుతూనే వచ్చాయి. బ్రిటిష్, జర్మన్, ఫ్రెంచి, సంయుక్త రాష్ట్రాల సామ్రాజ్యవాదులకి వారిలో వారికున్న వివాదమే, కాల్వలుకట్టి ప్రవహించిన మానవరక్తాన్ని మూల్యంగా అపహరించిన వివాదమే, ఆఫ్రికా ఖండంలో ఏ యే వలసలు జర్మనీ స్వాధీనంలోనూ ఫ్రాన్సు, బ్రిటన్‌ల స్వాధీనంలో వుండాలనే వివాదమే, సమీపప్రాచ్య ప్రజలపై జర్మన్ క్రుప్‌లు రాజ్యం చలాయించాలా, లేక ఆంగ్లో-ఫ్రెంచి-అమెరికన్ ఆరమ్‌స్ట్రాంగ్‌లు, రోత్‌షిల్డ్‌లు, రాక్‌ఫెల్లర్‌లు రాజ్యంచలాయించాలా అనే వివాదమే వారికింకా తెగని కారణంగా శాంతిని గురించి చర్చించేందుకే వారికి మనస్కాపిందికాదు.

యుద్ధం ఇంకా కొనసాగాలనే శక్తివంతమైన సామ్రాజ్యవాద ప్రయోజనాలు డిమాండు చేశాయి. ఈ ప్రయోజనాలు ప్రజల ప్రయోజనాలకు వ్యతిరేకమయాయి.

* * *

శాంతియుత సహజీవన విధానం, ప్రపంచంమీద సుస్థిరమూ శాశ్వతమూ అయిన శాంతిని స్థాపించేందుకు పోరాటం — ఇది "తాత్కాలికమైన" విధానం కాదు, ఇది సోవియట్

ప్రభుత్వం పన్నిన "వ్యూహం" సుమండీ అని సామ్రాజ్యవాద శిబిరంలోని దూషకులు ఘోష పెడుతూన్నట్టి వ్యూహమూ కాదు, శాస్త్రీయ సోషలిజం అవలంబించే సమగ్ర ప్రపంచదృక్పథంనుండే అనివార్యంగా ప్రాదుర్భవించుతూన్న విధానమే, సోషలిస్టు సమాజ మూలప్రయోజనాలకు అనుగుణమైన విధానమే శాంతియుత సహజీవనం.

సోషలిస్టు వ్యవస్థను ఇతర దేశాల నెత్తిన బలవంతాన రుద్దే ఉద్దేశంతో వాటిపై సాయుధ దాడి జరిపేందుకని సోషలిస్టు రాజ్యం దురాక్రమణ పథకాలను తయారు చేస్తుందనేది సోవియట్, కమ్యూనిస్టు వ్యతిరేక దూషణే పరమావధిగా పెట్టుకునే మనుషులు అమితానందంతో స్వారిచేసే "గాలి గుర్రం".

సోషలిస్టు రాజ్యాలకున్న నిజమైన అభిప్రాయాలూ, వాటి సిద్ధాంతాలూ ఆచరణా, వాటి పథకాలూ ఉద్దేశాలూ, వీటిని గురించి ఏ మాత్రమూ తెలియని వుత్త వెర్రిబాగులవారిని మోసపుచ్చేందుకు అభూతకల్పనే తప్ప ఇది మరొకటి కాదు. బయటనుండి దాడిచేయడం మూలంగా సోషలిజాన్ని తీసుకొచ్చి ఒక దేశంలో ప్రవేశపెట్టేందుకు వీలవుతుందనే భావం కంటె మార్క్సిజం-లెనినిజం యావత్తు భావానికి సుతరామూ అన్యమైనది ఇంకొకటుండబోదు.

అన్నిటికంటె ముందు మార్క్సిజం-లెనినిజం ఒక శాస్త్రం; అందుచేత అన్ని శాస్త్రాల్లాగానే దీని పర్యవసానాలు కూడా పరీక్షకు నిలబడి రుజువుకాబడిన మౌలిక సిద్ధాంత ప్రమేయాలు కొన్నిటిపై ఆధారపడి వుంటాయి. మార్క్సిజం-లెనినిజం తీసుకునే ప్రమేయాలలో ప్రధానమైన ప్రమేయం ఒకటి ఇలా చెబుతుంది: నూతన, సోషలిస్టు సామాజిక వ్యవస్థలోకి పరివర్తన చెందేందుకు ఆవశ్యకములైన ఆర్థిక, రాజకీయ పరిస్థితులు పరిపక్వమైనప్పుడే సోషలిజం ఉద్భవించగల్గుతుంది, ఉద్భవించి తీరుతుంది కూడా. మార్క్స్, లెనిన్‌లు ప్రవచించిన సిద్ధాంతానికి ఇది మూలరాయి. "సోషలిజం స్వాప్నికుల కల్పనకాదు, ఆధునిక సమాజంలోని ఉత్పాదక శక్తుల అభివృద్ధి అంతిమ లక్ష్యమూ, అపరిత్యాజ్య ఫలితమే అది," అన్నాడు లెనిన్.

ఏ దేశంలోనైనా సరే సోషలిస్టు విప్లవాన్ని సాధించే శక్తి ఆ దేశంలో కార్మికవర్గ వాయకత్వం కింద వున్న ప్రజల శక్తే తప్ప మరొకటేదీ కాదు. ఆ దేశంలోనే వున్న కార్మిక ప్రజారాసులే సోషలిజం ఆవశ్యకతను గుర్తించి, సోషలిజంలోకి పరివర్తనకై తమ పోరాటాన్ని ఎప్పుడైతే తామే ప్రారంభించుతారో అప్పుడు మాత్రమే సోషలిస్టు విప్లవం చరితార్థం కాగల్గుతుంది. ఏదో బయట వున్న శక్తి ఒకటి సోషలిస్టు సామాజిక వ్యవస్థను "ప్రవేశపెట్ట" గల్గుతుందనీ, ఒక వత్తి బేలును ఒక దేశంనుంచి ఇంకొక దేశానికి ఎలాగైతే దిగుమతి చేస్తారో ఆ మోస్తరుగానే సోషలిస్టు విప్లవాన్ని "దిగుమతి" చేయవచ్చునవనే భావం ఎంత హాస్యాస్పదమైవదీ, మార్క్సిస్టు-లెనినిస్టు అంతస్సారానికే ఎంత అన్యమైవదీ అంటే, ఇంత పొడుగా వున్న

దొంగ నాణాన్ని మార్క్సిజంపై విమర్శగా చలామణీ చేసేందుకు ప్రయత్నించే మనుషులు ఇంకా వున్నారా అనే ఆశ్చర్యాన్ని అది పుట్టించక మానదు.

మార్క్స్, ఎంగెల్స్, లెనిన్‌లు ఈ ప్రశ్నపై పదే పదే ప్రస్తావించారు. 1882 సెప్టెంబరు 12 వ కౌట్‌స్కీ పేర ఎంగెల్స్ రాసిన లేఖను గుర్తుకుతెచ్చుకుందాం. పురోగామి పెట్టుబడిదారీ దేశాల్లోని కార్మికవర్గం సోషలిస్టు విప్లవాన్ని పూర్తిచేసిన తరువాత అది వలసదేశాలకు స్వాతంత్ర్యాన్ని ఇస్తుంది, అని ఆ లేఖలో ఎంగెల్స్ రాశాడు. ఆ లేఖలో ఆయన ఇంకా ఇలా అన్నాడు: "సోషలిస్టు నిర్మాణానికి అవి కూడా చేరుకొనేముందు ఎట్టి సామాజిక, రాజకీయ దశల గుండా అవి పయనించాల్సి ఉంటుందో, అందు గురించి మనం నేడు ఇంచుమించు వృథా శాస్త్రకల్పనలు మాత్రమే ప్రతిపాదించ గల్గుతాం. ఒకటి మాత్రం నిశ్చయం: విజయవంతమైన శ్రామికవర్గం ఎట్టి దీవనలనూ ఏ పరజాతిపైనా బలవంతాన రుద్దజాలదు, ఆవిధంగా చేయడంవల్ల అది తన సొంత విజయాన్నే నాశనం చేసుకొంటుంది." (ఒత్తుల మేం పెట్టినవి — సం.)

మార్క్సిజం-లెనినిజం స్థాపకులు ఈ ప్రశ్నకు మరే ఇతర విధంగానూ కాకుండా కేవలం ఈ విధంగానే — కమ్యూనిజాన్ని ఇతర ప్రజలపై "బలవంతాన విధించే" అవకాశాన్ని పూర్తిగా తిరస్కరించడం వల్లనే — పరిష్కరిస్తారు. ఇటువంటి "బలవంతపు విధింపు" సాధ్యమని భావించే మనుషులు "పిచ్చివాళ్లయినా అవాలి, లేకుంటే కవ్వింపుదార్లు అయినా అవాలి" అని అన్నాడు లెనిన్.

* * *

ఇక ఇప్పుడు "శాంతిని గురించి ఉత్తర్వు" ప్రకటించిన తరువాత జరిగిన ఘటనలకు వద్దాం.

మనం పైన చెప్పినట్టుగా, సామ్రాజ్యవాద రాజ్యాలలో ఒకటైనా కూడా సోవియట్ ప్రభుత్వానికి ప్రత్యుత్తరమివ్వలేదు. శాంతి సంప్రతింపులు ప్రారంభించవలసిందన్న ప్రతిపాదనకు తిరస్కృతి తప్ప మరేమీ లభించలేదు.

అప్పుడిక సోవియట్ ప్రభుత్వం తన ప్రజల కోర్కె ననుసరించి, జర్మనీతో శాంతి సంధిని కుదుర్చుకుంది. సోవియట్ ప్రజలకు ఊపిరి తీసుకుందుకు వ్యవధి దొరికి, శాంతియుతమైన కృషికి నడుముకట్టారు.

కాని బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, జపాన్ మాత్రం యువ సోవియట్ రిపబ్లిక్ మీద యుద్ధం ప్రారంభించాయి. జర్మనీతో నాలుగేళ్ల పాటు యుద్ధం చేసిన తరువాత రష్యా పూర్తిగా అలసిపోయుంటుందని, ఆర్థిక వినాశమూ ఆకలి వస్తులూ

ఫలితంగా వ్యవధానానికి వ్యతిరేకంగా కాస్త ఏ మాత్రపు గట్టి ప్రతిఘటన అయినా సరే చూపేందుకు శక్తిలేనంత దుస్థితికి దిగజారిపోయి వుంటుందనీ అవి లెక్కవేసుకున్నాయి. ఆంటాంట్ మండలి రష్యన్ విప్లవ ప్రతీఘాత శక్తిని సమీకరించి, రష్యన్ ప్రజలు తరిమి వేసిన భూస్వాములనుండీ పెట్టుబడిదార్లనుండీ బలగాలను కూడగట్టుకుని, వాటితో దేశంలో ఉత్తరాన, తూర్పున, దక్షిణాన "ప్రభుత్వాలను" సృష్టించి, ఆనాడు సోవియట్ ప్రాంతంలో వుండిన చెకొస్లొవాక్ కోర్ సోవియట్‌కు వ్యతిరేకంగా లేవదీసిన తిరుగుబాటుకు డబ్బు సాయంచేసి, దెనికిన్, కొల్చాక్, యుదేనిచ్ తదితర జారిస్టు జనరల్సు నడిపిన విప్లవ ప్రతీఘాత సైన్యాలకు ఆయుధాలను సమకూర్చిపెట్టింది. అదే సమయంలో ఆంటాంట్ రాజ్యాలు తమ సొంత సేనలను రష్యాకు తరలించాయి. బ్రిటిష్, అమెరికన్ సైనికబలాలు 1918 వసంతంలో మూర్మన్‌స్క్, అర్ఖాంగెల్‌స్క్ రేవుల్లో దిగాయి. 1918 ఏప్రిల్ 5 న జపాన్‌వారు తమ సైనికబలాలను వ్లదివొస్తోక్‌లో దింపారు, అదే సంవత్సరం ఆగస్టులో జనరల్ గ్రేవ్స్ నాయకత్వాన అమెరికా సంయుక్త రాష్ట్రాల సైనికబలాలు కూడా వ్లదివొస్తోక్‌లోనే దిగాయి. ఆంటాంట్ సుప్రీమ్ కౌన్సిల్ 1918 జూలై 2 న జారీచేసిన ఉత్తరువు రష్యాలోని దూరప్రాచ్యపు భూభాగాలను ఆక్రమించుకోవడంలో తన లక్ష్యాలను నిర్వచించుతూ మాటలనేమీ మిగల్చకుండా చెప్పేసింది: "సైబీరియాను కంట్రోలు చేసే అవకాశం భవిష్యత్తులో మళ్లీ దొరకడం అసంభవమే గనుక, అట్టి అవకాశాన్ని మిత్రమండలి వినియోగించుకు తీరాలి." బకూ నగరాన్ని పట్టుకొనడానికి బ్రిటిష్ సైనికబలాలు 1918 వేసవిలో ప్రయత్నించాయి, ఫ్రెంచి యుద్ధనౌకలు కూడా నల్ల సముద్రంలోకి ప్రవేశించి, ఒదేస్సలో సైనికబలాలను దింపాయి.

చక్రబంధంలో చిక్కుకున్నట్టు యావత్తు సోవియట్ రష్యా తెలుసుకుంది. రష్యన్ కార్మికప్రజలందరూ తమ సోషలిస్టు మాతృభూమి రక్షణార్థం ఒక్కుమ్మడి లేచారు.

వ్యవధానం ఎలా అంతమైనదీ లోకవిదితమే. అది ఇక తలెత్తుకోలేకుండా ఓడిపోయింది. సామ్రాజ్యవాదులు సోవియట్ రష్యాపై పదే పదే యుద్ధచర్యలు నడిపించారు, కాని వారు యుద్ధచర్యలు నడిపించిన ప్రతీ సారీ వాటిని సోవియట్ రష్యా తిప్పికొట్టింది. ఆకలితో మాడుతూ, సరైన దుస్తులు, సరైన జోళ్లులేక, సరైన ఆయుధసామగ్రి కొరవడిన ఎర్రసైన్యం, సుశిక్షితులై భేషుగ్గా సాయుధులై, మంచి అస్త్ర సరంజామాను కల్గిన ఆంటాంట్ సైన్యాలను ఒక సారి కాదు, రెండు సార్లు కాదు, తలపడినప్పుడల్లా వాటిని చిత్తుగా ఓడించేశాయి. ఓడిపోగా మిగిలిన తమ సేనావశేషాలను ఇక సోవియట్ రష్యా గడ్డనుండి తరలించివేయక వ్యవధాతలకు తప్పింది కాదు. 1920 వసంతకాలంలో క్లెమాన్‌సో, చర్చిల్‌లు మళ్లీ మరొక ప్రయత్నం చేశారు — రష్యాపై దాడి సాగించాల్సిందని పోలిష్ ప్రభుత్వాన్ని

ఒప్పించడంలో వారు కృతకృత్యులయారు. కాని ఈ పోలిష్ దండయాత్ర కూడా అంతకు ముందు జరిగిన యుద్ధకార్యాలన్నిటిలాగానే సోవియట్ రిపబ్లిక్ విజయంతో అంతమైంది.

ఈ విధంగా సామ్రాజ్యవాదులకు – తమ ప్రయోజనాల దృష్ట్యా చూసుకున్నప్పటికీ కూడా — తమ ఆయుధాలను ఒక పక్కను వుంచి, ఈ భూప్రపంచంమీద నూతన దేశం ఒకటి, ఏ దేశంలోనైతే సోషలిస్టు సామాజికార్థిక సంబంధాలు స్థాపితమయాయో అట్టి నూతన దేశం ఒకటి అవతరించిందనీ, అది మనుతూందనీ, మని తీరుతుందనీ గుర్తించడమే సబబుగా వుంటుందని అత్యంత విశ్వాసజనకంగా రుజువైంది.

సోషలిస్టు, పెట్టుబడిదారీ విధాన దేశాల మధ్య శాంతిని స్థాపించి, వర్తక సంబంధాలను నెలకొల్పవలసినదిగా, వ్యవధానం జరిగిన ముందుకాలంలోనూ, వ్యవధానం జరుగుతూన్న కాలంలోనూ, సోవియట్ గడ్డనుండి ఆంటాంట్ సైన్యాలు తరిమివేయబడిన తరువాతనూ రష్యాదేశపు కార్మికుల రైతుల ప్రభుత్వం ఆంటాంట్ రాజ్యాలకు అనేక సార్లు విజ్ఞప్తిచేసింది. సోవియట్ ప్రభుత్వం 1918 నుండి 1921 వరకూ ఇరవైకి తక్కువకాకుండా శాంతి ప్రతిపాదనలు చేసింది. ఫ్రాన్సు, బ్రిటన్, జపాన్ అమెరికా సంయుక్త రాష్ట్రాల తలబిరుసు ప్రభుత్వాలకు బుద్ధి వచ్చేందుకని సంప్రతింపులకై అన్ని అవకాశాలనూ అన్ని మార్గాలనూ సోవియట్ ప్రభుత్వం వినియోగించింది. అంతర్జాతీయ రాజకీయాలపై ఏడవ సోవియట్ల మహాసభ 1919 డిశంబరు 5 న చేసిన తీర్మానంలో, సోవియట్ రష్యా "సర్వజాతులతోనూ శాంతియుతంగా జీవించాలనీ, ఉత్పత్తి, రవాణా, పరిపాలనా వ్యవహారాలను సోవియట్ వ్యవస్థ ప్రాతిపదికపై పునర్నిర్మించుకుందుకుగాను తన యావచ్ఛక్తినీ ఆంతరంగికాభివృద్ధి కోసం వినియోగించుకోవాలనీ కోరుతూంది; ఆంటాంట్ వ్యవధానమూ, క్షుద్బాధాకరమైన దిగ్బంధనమూ దీనిని ఇంతవరకూ జరగకుండా చేశాయి" అని ఉద్ఘాటించింది. ఆంటాంట్ రాజ్యాలకు సోవియట్ ప్రభుత్వం సూచించిన వివిధ శాంతి ప్రతిపాదనల జాబితాను ఈ తీర్మానం పేర్కొంది.

వెనుకటి శాంతి ప్రతిపాదనలు అన్నిటిలాగానే, ఏడవ సోవియట్ల మహాసభ తీర్మానానికి కూడా ఎట్టి సమాధానమూ అందలేదు.

నిజమే, 1919 మార్చిలో అమెరికన్ దౌత్యతంత్రజ్ఞుడు విలియమ్ బుల్లిట్ మాస్కోకు వచ్చాడు. సోవియట్ ప్రభుత్వంతో చేసుకోనున్న శాంతి సంధి షరతులను సమన్వయపరచేందుకని అధ్యక్షుడు విల్సన్ ఆదేశాలపై తాను వచ్చినట్టు అతడు చెప్పాడు. లెనిన్‌తోనూ చిచేరిన్‌తోనూ బుల్లిట్ జరిపిన సంభాషణల ఫలితంగా ప్రాథమిక శాంతి సంధి రూపొందించడం జరిగింది; దానిపై ఆంటాంట్ ప్రభుత్వాలచేత సంతకాలు చేయించడం కోసమని దానిని బుల్లిట్ తనతో తీసుకెళ్ళాడు. కాని అతడు తీరా వాషింగ్టన్ తిరిగి చేరుకునే సరికి, అతనిని

విల్సన్ చూడను పొమ్మన్నాడు, ఇక దానితో బుల్లిట్ రాయబారానికి ఫలితం లేకుండా పోయింది. విల్సన్ "మనస్థితిలో" మార్పు రావడానికి కారణం ఏమంత దురూహ్యంకాదు, అది సరళమైనదే: ఆంటాంట్ ఆయుధాలిచ్చి, డబ్బు మదుపు పెట్టిన కొల్చాక్ సైన్యం 1919 వసంత కాలంలో సోవియట్‌పై దాడి ప్రారంభించింది, దాంతో రష్యన్ విప్లవ ప్రతిఘాతానికి విజయం తథ్యమని విల్సన్ ఆశపడ్డాడు. ఆ ఆశలన్నీ బూడిదలో పోసిన పన్నీరయ్యాయని తరువాత జరిగిన ఘటనలు రుజువుచేశాయి.

1920 ఆకురాలుకాలానికి, ఆంతరంగిక విప్లవ ప్రతిఘాతమూ, వైదేశిక వ్యవధానమూ అంతిమంగా ఓటమిచెందిన తరువాత, ఇకప్పటికి సోవియట్ ప్రజకి తమ ప్రధాన కర్తవ్యాన్ని — ఏళ్ళతరబడిని ఎడతెరిపి లేకుండా కొనసాగిన యుద్ధాల మూలాన నాశనమైపోయిన రష్యన్ ఆర్థికవ్యవస్థను పునరుద్ధరించుకొనడమూ, సోషలిజాన్ని నిర్మించుకొవడమూ అనే కర్తవ్యాన్ని — నెరవేర్చుకునే అవకాశం చిట్టచివరకు చిక్కింది.

సోవియట్ దేశం నూతానాభివృద్ధి దశలో అడుగు పెట్టింది. "ఊపిరి తీసుకుందుకు క్షణమాత్రపు తీరిక సమయమే కాకుండా అంతకంటె అధికమే మనకు లభించినట్టు... పెట్టుబడిదారీ విధాన రాజ్యాల జాలకంలో మన అంతర్జాతీయ స్థానాన్ని మనం మౌలికంగా గెల్చుకున్నట్టి నూతన వ్యవధి కాలం మనకిప్పుడు లభించింది" అని 1920 నవంబరు 21 న లెనిన్ అన్నాడు. "సోషలిస్టు, పెట్టుబడిదారీ విధాన రాజ్యాలు ఒకదాని సరసను ఒకటి మనగల్గే" కాలం, శాంతియుత సహజీవన కాలం, అదే లెనిన్ అప్పుడప్పుడు అన్నట్టుగా సోషలిస్టు, పెట్టుబడిదారీ విధాన దేశాల "శాంతియుత సహనివాస" కాలం ప్రపంచ చరిత్రలో ప్రారంభమైంది.

సోషలిస్టు సమాజ నిర్మాణ కార్యంలో సోవియట్ ప్రజ అమితోత్సాహంతో పాల్గొనారంభించింది. ఇది కేవలం శాంతి పరిస్థితుల్లోనే, శాంతియుత సహజీవన పరిస్థితుల్లోనే సాధ్యమయే కార్యం. సోవియట్ ప్రజకి యుద్ధం సుతరామూ అవసరంలేదు, వారి పురోగమనాన్ని అది అరికట్టుతుంది, ప్రధాన కర్తవ్యాన్ని, సోషలిస్టు నిర్మాణమనే కర్తవ్యాన్ని సాధించకుండా అడ్డుతగులుతుంది.

ఇక అచ్చంగా శాంతియుత శ్రమ ద్వారానే సోవియట్ దేశం ఇతర దేశాలపై తన ప్రభావాన్ని నానాటికి మరింత హెచ్చుగా నెరపుతూంది. వెనుకబడిన దేశాలపై సోవియట్ దేశం తన ప్రభావాన్ని చూపగల్గుతూంది అంటే, బలప్రయోగంవలన కాదు, యుద్ధంవలన కాదు, పెట్టుబడిదారీ విధానంతో పోల్చిచూస్తే సోషలిజమే ఉపయోగకారి అని నిరూపించేటట్టి శాంతియుతమైన సోషలిస్టు నిర్మాణంలో సాధించిన విజయాల వల్లనే. ఆర్థికాభివృద్ధిలోనూ సాంస్కృతికాభివృద్ధిలోనూ సోషలిస్టు దేశం సాధించిన విజయాలు ఎంత అధికంగా వుంటే, అంతర్జాతీయంగా ఆ దేశపు ప్రతిష్ఠ అంత గొప్పగా వుంటుంది.

ఉదాహరణకున్న శక్తిని గురించి లెనిన్ ప్రస్తావించాడు. దోపిడీ, అసమానతలు పునాదులుగా వున్న సమాజ రూపంనుండి, దోపిడీ లేనట్టి అసమానతలు లేనట్టి, యుద్ధాలు లేనట్టి రూపంలోకి పరివర్తన చెందడం అవసరమని, ఉదాహరణకుగల బలంవల్లనే నానాటికి అధిక సంఖ్య జనానికి నమ్మకం కుదురుతుంది. సోషలిజాన్ని నిర్మించుతూనే "ఇదెలా చేయడమో ఉదాహరణవల్లనే" మనం చూపుతాం, అని లెనిన్ చెబుతూ, ఆయన ఈ ప్రశ్నను ఈ విధంగా ప్రదర్శించాడు: " 'సోషలిజానికున్న బలం ఉదాహరణలోనే వుంది,' అని మనం ఇదివరకూ అన్నాం, ఇప్పుడూ అంటాం. తన రాజ్యాధికారాన్ని పునస్థాపించుకోవాలని ఎవడు ఆశించుతున్నాడో వాడి మీద బలంప్రయోగం తన శక్తిని చూపుతుంది. కాని బలప్రయోగానికున్న ప్రాముఖ్యత అక్కడితో అంతమైపోతుంది, ఇక అటుపైని శక్తి అంతా ప్రభావానిదీ, ఉదాహరణదీనీ. కమ్యూనిజం అర్థాన్ని ఉదాహరణపూర్వకంగా, ఆచరణలో నిరూపించాలి."

పదవ అఖిల రష్యా రష్యన్ కమ్యూనిస్టు పార్టీ (బోల్షెవిక్) కాంగ్రెస్ ముగింపు ముందు 1921, మే 28 న ఇచ్చిన సంక్షిప్తోపన్యాసంలో సోషలిస్టు విప్లవ ప్రభావ సమస్య పట్ల సోవియట్ ప్రభుత్వం తీసుకునే స్థానంలో వున్న అంతస్సారాన్ని లెనిన్ ఈ విధంగా ప్రదర్శించాడు:

"అంతర్జాతీయ విప్లవంపైన మన ప్రభావాన్ని ఈనాడు ప్రధానంగా మన ఆర్థిక విధానం ద్వారానే మనం తీసుకొస్తున్నాం... ఇప్పుడు పోరాటం ప్రపంచస్థాయిలో ఈ క్షేత్రం లోకి బదిలీ అయింది. ఈ సమస్యను మనం పరిష్కరించామంటే — అప్పుడు మనం నిర్దిష్టంగానూ అంతిమంగానూ ప్రపంచస్థాయిలో గెల్చుకున్నామన్నమాటే. కనుకనే మనకు ఆర్థిక నిర్మాణ సమస్యలు అసాధారణ ప్రాముఖ్యత వహించుతున్నాయి. ఈ యుద్ధ క్షేత్రంలో మెల్లగా, క్రమక్రమంగా — శీఘ్రంగా అసలు వీలుపడదు — అయినప్పటికీ నిలకడగా సాగే అభివృద్ధివల్లనే, ముందుకు వెళ్లడంవల్లనే మనం విజయం చేపట్టాల్సి వుంటుంది."

శాంతియుత సహజీవనమంటే విభిన్న సామాజికార్థిక వ్యవస్థలు గల రాజ్యాల మధ్య యుద్ధం లేకపోవడం ఒక్కటే కాదు, ఈ రాజ్యాల మధ్య సక్రమమైనట్టి సుస్థిరమైనట్టి ఆర్థిక, సాంస్కృతిక సంబంధాలు నెలకొని వుండడం కూడానూ. పశ్చిమంతో ఆర్థిక సంబంధాలను అభివృద్ధి చేసుకుందుకు సమగ్రమైన కార్యక్రమాన్నొకదానిని లెనిన్ 1920 లో ఆలోచించాడు. ఆ కార్యక్రమంలో వాణిజ్యానిదే ప్రథమస్థానం. రైల్వేఇంజన్లు, పరిశ్రమకు యంత్రాలు రష్యాకు ఎంతగానో అవసరమయ్యాయి. రష్యాలో దొరికే ముడిపదార్థాలు పాశ్చాత్యానికి అవసరమయాయి. విదేశీ పెట్టుబడిదార్లకు ఒక వరుసకి వరుస పారిశ్రామిక రాయితీలను మంజూరు చేయడానికి కూడా సోవియట్ ప్రభుత్వం ఒప్పుకుంది. ఫ్రెంచి, బ్రిటిష్, అమెరికా సంయుక్త రాష్ట్రాల పాలకవర్గాలు అహంకారవు, తలబిరుసు వాలకాన్ని ఇంకా మానుకోనప్ప

టికీ దానిని లక్ష్యం చేయకుండానే, పెట్టుబడిదారీ ప్రపంచంతో ఆర్థిక సంబంధాలను పెంపొందించుకుందుకే సోవియట్ ప్రభుత్వం ప్రయత్నించింది. సోవియట్ రష్యాను గుర్తించడమనే ప్రశ్న — వాటి గుర్తింపు లేకపోతే దాని అస్తిత్వమే అక్కడికి ఎగిరిపోయినట్టు! — అసలే లేదంటూ వాటి పత్రికలు గొంతుక చించుకుని అరిచాయి. రష్యాతో వర్తకవాణిజ్యాలు నిరాకరించి, ఆర్థిక దిగ్బంధన విధించామంటే ఇక దాని చావు గడియలు దగ్గరపడతాయి కదా అని సామ్రాజ్యవాదులు కలలు కంటూ తృప్తిపడ్డారు.

అదేసమయంలో సోవియట్ రష్యాకి వ్యతిరేకంగా సరికొత్త వ్యవధాన పథకాలకు తమ దోహదాన్ని కొనసాగించారు. వారు ఇదివరలో ఓడిపోయి, తాత్కాలికంగా మాత్రమే అస్త్రసన్యాసం చేశారు; కాని సోషలిస్టు దేశంపై మళ్లీ యుద్ధానికి వెనుకటికంటె అనుకూలమైన అవకాశం ఎప్పుడు దొరుకుతుందా, ఎప్పుడు యుద్ధానికి బయల్దేరుతామా అని ఉబలాట పడ్డారు. "కమ్యూనిస్టు ఉద్యమాభివృద్ధి ఎంత ప్రగాఢంగానూ, ప్రచండంగానూ ఉంటుందో, మన రిపబ్లిక్ పీక నులిమివేసేందుకు వారి పునః ప్రయత్నాలు అంత అధికంగా వుంటాయి" అని లెనిన్‌కి తెలుసు. "పెట్టుబడిదార్లు యుద్ధానికి సాకులు వెతుకుతూనే వుంటారు" అనీ, "పరిస్థితులలో రవంత మార్పు సంభవించినప్పుడల్లా సామ్రాజ్యవాదపు దోపిడిదొంగలు మనమీద మళ్లీ దాడిచేస్తారనే అనుకుని అందుకు మనం సిద్ధంగా వుండాలి" అనీ లెనిన్ ముందుగానే హెచ్చరికచేశాడు. ఎనిమిదవ అఖిల రష్యా సోవియట్ మహాసభకు ఇచ్చిన నివేదికలో లెనిన్ ఇలా అన్నాడు: "పెట్టుబడిదారీ దేశాల సరసను సోవియట్ రిపబ్లిక్ ...ఉనికి అనే ప్రశ్న — ఇది పెట్టుబడిదారీ విధానానికి ఎంతగా గిట్టని విషయమంటే, మళ్ళీ యుద్ధం ప్రారంభించేందుకు పెట్టుబడిదార్లు ఏ అవకాశాన్నయినా సరే లంకించుకుంటారు. ఈనాడు ప్రజలు సామ్రాజ్యవాద యుద్ధంతో విసిగిపోయున్నారు, యుద్ధం ఇంకా కొనసాగే పక్షంలో తమ ఆగ్రహం ఇంకా జోరవుతుందని వారు బెదరిస్తున్నారు, కాని కొద్ది సంవత్సరాల తరువాతనే పెట్టుబడిదార్లు యుద్ధాన్ని పునరారంభించగల్గే అవకాశం లేకపోలేదు."

1920 ఫిబ్రవరిలో ఒక అమెరికన్ పత్రికావిలేకరి లెనిన్‌ని ఇలా ప్రశ్నించాడు:

"బాహ్యంనుండి విప్లవ ప్రతీఘాతక జోక్యం విషయమై ఇంకా రష్యా భయపడాల్సే వుందా?"

ఈ ప్రశ్నకు లెనిన్ ఇలా సమాధానమిచ్చాడు:

"దురదృష్టవశాత్తూ భయపడాల్సే వుంది. ఇందుకు కారణం పెట్టుబడిదార్లు తెలివిమాలినవాళ్ళూ దురాశపరులూ కావడమే. ఇటువంటి తెలివిమాలినట్టి దురాశాపూరితమైనట్టి జోక్యపు యత్నపరంపరను వాళ్లు జరిపించి వుండడంచేత, అన్ని దేశాల కార్మికులూ రైతులూ

తమ తమ పెట్టుబడిదార్లను పునః పెంచి వృద్ధిలోకి తెచ్చేంత వరకూ ఇదో మళ్ళీ మళ్ళీ జరుగుతుందనే భయంవుండనే వుంటుంది."

లెనిన్ చేసిన పురోసూచన ఎంత యథార్థంగా పరిణమించిందో దరిమిలా చరిత్రే రుజువుచేసింది. సోవియట్ యూనియన్‌పై యుద్ధంచేయడానికని ఫాసిస్టు జర్మనీ అనేక సంవత్సరాలుగా సన్నద్ధమవుతూ వచ్చింది, జర్మన్ సామ్రాజ్యవాదులూ, తమ మ్యూనిచ్ విధానంతో వీరికి మద్దతు ఇచ్చినవారూ తయారుచేసిన పథకాల ప్రకారం, ప్రపంచంలోని మొట్టమొదటి సోషలిస్టు దేశాన్ని నామరూపాలులేకుండా నాశనంచేసి తీరడమే ఈ యుద్ధానికి లక్ష్యం. చరిత్ర ఈ లెక్కను కూడా తలకిందులు — ఇదివరకు ఎన్ని సార్లు చేయలేదు గనుక! — చేసివేసింది. ఒకే ఒక సోషలిస్టు దేశం బదులు, రెండవ ప్రపంచ యుద్ధం తరువాత ప్రపంచ సోషలిస్టు వ్యవస్థే అవతరించింది. అయితేనేమి, చరిత్రనే వెనక్కి లాగడానికి మొండిగా ప్రయత్నించే మనుషులు చరిత్ర నేర్పే గుణపాఠాలను పెడచెవిని పెడతారు, కనుకనే మరొక ప్రపంచ యుద్ధపు — ఈసారి ఏకంగా థెర్మోన్యూక్లియర్ యుద్ధపు — మారణహోమ జ్వాలను రుగుల్కొల్పాలని సామ్రాజ్యవాద శిబిరంలోని పట్టెడుమంది పిచ్చివాళ్లను మనమిప్పుడు కళ్లారా చూస్తున్నాం.

1920, 1921 సంవత్సరాల మధ్యకాలంలో బ్రిటిష్, అమెరికన్ పత్రికావిలేకరులు అంతకంతకు మరింత తరుచుగా మాస్కోకు వస్తూండేవారు. వీరితో లెనిన్ జరిపిన సంభాషణలలో శాంతి, శాంతియుత సహజీవనం, రష్యా పెట్టుబడిదారీ విధాన దేశాల మధ్య సుస్థిరమూ శాశ్వతమూ అయిన ఆర్థిక సంబంధాల స్థాపన సమస్యకే ఆయన ప్రధాన స్థానం ఇచ్చాడు. సోవియట్ రిపబ్లిక్ అమెరికాల మధ్య, ఆయన అభిప్రాయంలో, శాంతికి ప్రాతిపదికలు ఏమిటి అని "New York Evening Journal" విలేకరి లెనిన్‌ను ప్రశ్నించగా, సోవియట్ ప్రభుత్వాధినేత ఇలా సమాధానమిచ్చాడు:

"అమెరికన్ పెట్టుబడిదార్లు మా జోలికి రాకుండా వుంటే చాలు. మేము వాళ్ల జోలికి వెళ్లం. మా రవాణా వ్యవస్థకీ, పరిశ్రమలకీ ఉపయోగపడే యంత్రాలనూ పనిముట్లనూ బంగారం ఇచ్చి కొనుక్కోడానికి కూడా మేము సిద్ధంగా వున్నాం. ఒక్క బంగారం ఇచ్చే కాదు, ముడిపదార్థాల రూపేణా కూడానూ."

అందుమీదట విలేకరి మళ్ళీ ప్రశ్నవేశాడు: "అటువంటి శాంతికి అవరోధాలు ఏమిటి?" అని.

అందుకు లెనిన్ ఇలా సమాధానమిచ్చాడు:

"మా వైపునుండి ఏమీ లేవు. అమెరికన్ (ఇంకా మరెవరైనా ఇతర) పెట్టుబడిదార్ల వైపు వున్న సామ్రాజ్యవాదమే అవరోధం."

విదేశ పత్రికావిలేకరులకిచ్చిన ఇంటర్వ్యూలలో, సోవియట్ రిపబ్లిక్ ఏ దేశంమీదనూ ఎన్నడూ దాడిచేయలేదనీ, అట్టి ఉద్దేశమే సోవియట్ రిపబ్లిక్‌కు లేదనీ, శాంతియుతమైన ఆర్థికాభివృద్ధే దాని లక్ష్యమనీ, విదేశ ప్రభుత్వాల ఆంతరంగిక వ్యవహారాల్లో అది ఎన్నడూ జోక్యం కలుగజేసుకో లేదనీ, అలాంటి ఉద్దేశమే దాని లేదనీ లెనిన్ పదే పదే ఉద్ఘాటించాడు. లెనిన్ ఇచ్చిన ప్రతి ఇంటర్వ్యూ కూడా సోవియట్ దేశపు వైదేశిక విధానంలోని మూలసూత్రాలపై దివ్యమైనట్టి, ఓపికతో ఒప్పినట్టి, సరళమైనట్టి వ్యాఖ్యానమే, సోవియట్ దేశంపై దాడిచేయాలని కలలు కంటూన్న "తెలివిమాలినవాళ్లూ, దురాశాపరులూ అయిన పెట్టుబడిదార్లను" ఉద్దేశించుతూ, ఎత్తిపొడుపులతో నిండిన వ్యాఖ్యానమే.

లింకన్ ఎయిర్‌తో మాట్లాడుతూ లెనిన్ ఇలా అన్నాడు:

"మా రాజ్యంలాంటి సోషలిస్టు రాజ్యం పెట్టుబడిదారీ దేశాలతో ఎట్టి కాలపరిమితీ సహితమూ లేని వ్యాపార సంబంధాలను ఎందుకు పెట్టుకోకూడదో ఏ కారణమూ అవుపించడంలేదు. పెట్టుబడిదారీ రైల్వేఇంజన్లనూ, వ్యవసాయ యంత్రాలనూ ఉపయోగించుకుందుకు మాకెలాంటి అభ్యంతరమూ లేనప్పుడు, మా సోషలిస్టు గోధుమలనూ, ఫ్లాక్స్ నారనూ, ప్లాటినమునూ ఉపయోగించుకుందుకు వారికెందుకు అభ్యంతరం వుండాలి? సోషలిస్టు గింజలూ కడమ గింజలూ రుచికి ఒకలాగే వుంటాయిగా — లేకుంటే వాటి రుచి వేరుగా వుంటుందేమో మరి?"

పాశ్చాత్య రాజ్యాలలోని దురాక్రమణ వర్గాలు సోవియట్ రష్యాతో వర్తక సంబంధాల అభివృద్ధిని కుంటుపరచేందుకు ఎంతగా తంటాలు పడినప్పటికీ, ఆ సంబంధాలు నానాటికి మరింత విస్తృతమయ్యాయి. 1921 మార్చిలో బ్రిటన్‌తో ఒక వర్తకపు ఒప్పందం కుదిరింది. జర్మనీ, స్వీడన్, ఇంకా ఇతర దేశాలతో వర్తకం మంచి చురుకుగా అభివృద్ధి పొందింది. తొమ్మిదవ సోవియట్ల మహాసభలో లెనిన్ మాట్లాడుతూ: "ఒక రకంగా క్రమసహితమూ శాశ్వతమూ అయిన వర్తక సంబంధాలూ, ప్రతినిధివర్గాలూ, ఒడంబడికలూ వగైరాలను రష్యా, ఒక విధంగా చెప్పాలంటే, పెంచుకుంది," అన్నాడు. లెనిన్ ప్రవచించిన శాంతియుత సహజీవన విధానం ప్రజలకు ప్రాణతుల్యమూ అత్యావశ్యకమూ అయిన అవసరాలకు అనుగుణ్యంగా వుండడం కారణంగా, ఆ విధానాన్ని వ్యతిరేకించినవారు ఎన్ని కుతంత్రాలు ప్రయోగించినప్పటికీ, సోవియట్ రష్యాకీ పెట్టుబడిదారీ విధాన ప్రపంచానికీ మధ్య ఆర్థిక సంబంధాలు బలపడేందుకు అవరోధం కలగలేదు. మీ ఇష్టానిష్టాలకంటెనూ అత్యంత బలమైన శక్తులు — మీ దేశాల ఆర్థికావసరాలు — వుండడం కారణంగా, మీకు మనస్సు వున్నా సరే లేకున్నా సరే, మాతో మీరు వర్తకం చేసే తీరాలి. రష్యాతో వర్తక సంబంధాలు లేనిదే యూరప్ ఆర్థికపునరుద్ధరణ అసాధ్యం — ఇదీ ఆ కాలంలోని లెనిన్ అభిభాషణల అంతస్సారం.

ఎలాగైతేనేమి, చిట్టచివరకు ఈ సత్యం అంటాంట్ సుప్రీమ్ కౌన్సిల్ మనస్సు కెక్కినట్లే కనబడింది. 1922 జనవరిలో జరిగిన కౌన్సిల్ కాన్ కాన్ఫరెన్స్ సోవియట్ రష్యా కూడా పాల్గొనేటట్టి ఒక ఆర్థిక, ఫైనాన్షియల్ అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను సమావేశపరచాలనే తీర్మానాన్ని అంగీకరించింది.

ఈ కాన్ఫరెన్స్ జెనోవాలో 1922 ఏప్రిల్ 10 న ప్రారంభమైంది.

లెనిన్ సోవియట్ ప్రతినిధివర్గానికి అధ్యక్షునిగా నియమితుడయాడు, కాని ఆయన జెనోవాకు ప్రయాణం చేయలేకపోయాడు; ఆయన బదులు, అప్పట్లో వైదేశిక వ్యవహారాల ప్రజా కమిస్సార్‌గా వున్న జి.వి. చిచేరిన్‌ని అధ్యక్షునిగా నియమించారు. అత్యంత ముఖ్యమైన అంతర్జాతీయ రాజకీయ, ఆర్థిక సమస్యలపై కొన్ని ప్రతిపాదనలను చిచేరిన్ కాన్ఫరెన్స్ ఎదుట తీసుకొచ్చాడు. అతడు తీసుకొచ్చిన ప్రతిపాదనలు విభిన్న సాంఘిక-రాజకీయ వ్యవస్థలు గల రాజ్యాల మధ్య శాంతియుత సహజీవన వర్ధిల్లేందుకు దోహదకారి అయిన కార్యక్రమంగా ఏర్పడ్డాయి. కాన్ఫరెన్స్ ప్రారంభమైన రోజునే చిచేరిన్ శాంతియుత సహజీవనంలోని ప్రధాన భావాన్ని ఈ విధంగా వ్యక్తపరచాడు:

"పాతవ్యవస్థ, కొత్తగా ఆవిర్భవించిన సోషలిస్టు వ్యవస్థ, ఈ రెండింటి సమాంతర అస్తిత్వం సాధ్యమైన ప్రస్తుతపు చారిత్రక శకంలో సార్వత్రిక ఆర్థిక పునరుద్ధరణ సాధనకై ఆస్తి, స్వామ్య పద్ధతులు రెండింటికీ ప్రాతినిధ్యం వహించుతూన్న రాజ్యాల మధ్య ఆర్థిక సహకృషి తప్పనిసరిగా ఆవశ్యకమని కమ్యూనిజం సూత్రాలకు కట్టుబడి వుంటూనే రష్యా ప్రతినిధివర్గం గుర్తించుతూంది."

చిచేరిన్ జెనోవాకు కొద్ది రోజుల్లో బయల్దేరుతాడనగా అతడు లెనిన్ పేర రాసిన లేఖను ఈ సంకలనానికి అనుబంధంగా చేర్చి పాఠకుని ముందుంచుతున్నాం. ఈ లేఖలో, సోవియట్ ప్రతినిధివర్గం జెనోవాలో కాన్ఫరెన్స్ ముందు తీసుకురాదల్చిన ప్రతిపాదనలలోని ప్రధాన వాదనలను చిచేరిన్ రేఖా మాత్రంగా చిత్రించాడు.

ఇవీ ఆ ప్రతిపాదనలు: "స్వయంనిర్ణయానికిగల హక్కు, సంపూర్ణంగా విడివడి పోయేందుకూ, లేదా హోమ్ రూల్‌కూ ప్రకటనా, పీడిత ప్రజలందరకూగల హక్కుల ప్రకటనను ప్రాతిపదికగా కల్గి, ప్రపంచంలోని సర్వప్రజలూ సంపూర్ణంగా సరిసమానమైన హోదాతో పాల్గొనే" అంతర్జాతీయ సంస్థ ఒకదాని స్థాపన, "యూరపియన్ ప్రజలతో సరిసమాన ప్రతిపత్తిలో నీగ్రో, తదితర వలసదేశాల ప్రజలు సర్వులూ కాన్ఫరెన్స్‌లలోనూ కమిషన్లలోనూ పాల్గొనాలి, తమ ఆంతరంగిక వ్యవహారాల్లో ఇతరుల జోక్యాన్ని ఆపుచేసే హక్కుకూ" హామీ; అంతర్జాతీయ సంస్థలలో "బలహీనుల పట్ల బలవంతుల ఐచ్ఛిక సహాకారమూ సహాయమూ, మొదటివారిని రెండవవారికి లోబడేవట్లు చేయకుండా వుండే విధంగా

వినియుక్తం కావాలి." చివరి విషయంగా, కొత్త యుద్ధాలను నివారించే లక్ష్యంతో సాధారణ నిరాయుధీకరణను సోవియట్ ప్రతినిధివర్గం ప్రతిపాదించింది.

ఫ్రాన్సు, బ్రిటన్ ప్రభుత్వాలు సోవియట్ ప్రతిపాదనలను తిరస్కరించి కాన్ఫరెన్సును భగ్నం చేసివేశాయి.

* * *

ఈనాడు కూడా, నలభై యేళ్ల కిందటి లాగానే, సుస్థిర శాంతి స్థాపన కోసమూ, యుద్ధప్రమాదాన్ని తొలగించడం కోసమూ సోవియట్ ప్రభుత్వం తన సర్వశక్తులనూ వినియోగించుతూంది. లెనిన్ ప్రవచించిన విభిన్న సామాజిక వ్యవస్థలు గల రాజ్యాల మధ్య శాంతియుత సహజీవన సూత్రాన్నే సోవియట్ ప్రభుత్వం తన అంతర్జాతీయ విధానానికంతకూ మూలసూత్రంగా ఏర్పరచుకుంది.

22 వ సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ కాంగ్రెస్‌లో ఆమోదించబడిన పార్టీ నూతన కార్యక్రమం ఇలా చెబుతూంది:

"సోవియట్ యూనియన్‌లో కమ్యూనిస్టు సమాజ నిర్మాణానికై శాంతియుత పరిస్థితులను సుస్థిరంచేయడమూ, ప్రపంచ సోషలిస్టు వ్యవస్థను అభివృద్ధి పరచడమూ, ఇతర శాంతికాముక ప్రజలతో కలిసి మానవజాతిని సర్వవినాశకరమైన ప్రపంచయుద్ధంనుండి విముక్తి చేయడమూ తన వైదేశిక విధానంయొక్క ప్రధాన లక్ష్యమని సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ పరిగణించుతూంది."

నేటి ప్రధాన సమస్య — యుద్ధమూ శాంతిని గురించిన సమస్య.

నూతన యుద్ధం ప్రజ్వరిల్లే ప్రమాదం సామ్రాజ్యవాదంనుండే ఉద్భవిల్లుతూంది. సామ్రాజ్యవాదులు — అందరికంటేనూ ముమ్మొందుగా అంతర్జాతీయ అభ్యుదయ నిరోధానికి ప్రధాన దుర్గమైన అమెరికా సంయుక్త రాష్ట్రాల సామ్రాజ్యవాదులు — ఆయుధాలను బ్రహ్మాండ రాసులలో పోగుపెడుతున్నారు, ప్రపంచం అన్ని భాగాల్లోనూ సైనిక స్థావరాలను స్థాపించుతున్నారు, దురాక్రమణ సైనిక కూటాలను సంఘటితపరుస్తున్నారు. ప్రతీకారమే, నూతన యుద్ధమే తమ ఏకైక లక్ష్యమైన హిట్లర్ ఆఫీసర్లూ జనరల్సూ నాయకులుగా వున్న జర్మన్ బుందెస్‌వేర్‌ను అణ్వస్త్రాలతో సాయుధం చేయడానికే అమెరికా సంయుక్త రాష్ట్రాలు, బ్రిటన్, ఫ్రాన్సుల ప్రభుత్వాలు సిద్ధపడుతున్నాయి. ఈనాడు నూతన యుద్ధమంటే థెర్మోన్యూక్లియర్ యుద్ధమే — మానవజాతికంతకూ అనన్యసామాన్యమగు ఘోరవిపత్తును తెచ్చిపెట్టే యుద్ధం, కోటానకోటి ప్రజల పాలిటి మృత్యుదేవతగా, దారిద్ర్యదేవతగా పరిణమించే యుద్ధమే

సామ్రాజ్యవాదులు సిద్ధంచేస్తూన్న ఈ థెర్మోన్యూక్లియర్ యుద్ధాన్ని, ఏది ఏమైనా సరే ఆరంభం కానివ్వకూడదు — ఇదే సోవియట్ అంతర్జాతీయ విధానపు ప్రధాన కర్తవ్యం. 1960 సెప్టెంబరులో ఐక్యరాజ్య సమితి సాధారణ సభ పదిహేనవ సమావేశం ఎదుట సోవియట్ ప్రభుత్వం సాధారణ సంపూర్ణ నిరాయుధీకరణకై ఒక ప్రతిపాదనను సమర్పించింది... ప్రపంచంపై సుస్థిరశాంతి స్థాపనకు సాధారణ సంపూర్ణ నిరాయుధీకరణే ఏకైక సాధనం. వాతావరణంలోనూ, అంతరిక్షంలోనూ జలగర్భంలోనూ అణ్వస్త్ర పాటవ పరీక్షలను విరమించుతూ 1963 ఆగస్టులో మాస్కోలో సంతకాలు జరిగిన ఒడంబడికను సర్వ దేశాల ప్రజలూ హృదయపూర్వకంగా హర్షిస్తున్నారు. ప్రపంచంలోని అధికసంఖ్యాకవర్గపు దేశాలు చేవ్రాలుచేసిన ఈ ఒడంబడిక శాంతిని సుప్రతిష్ఠితం చేసే ఉద్యమంలో ఒక పెద్ద ముందంజ.

మరొక యుద్ధాన్ని వారించడం సాధ్యమేనా?

అవును, సాధ్యమే, మరొక యుద్ధాన్ని వారించడం సాధ్యం, శాంతి స్థాపనకై అలసట ఎరుగని పోరాటాన్ని సాగించుతూన్నట్టి, శక్తివంతమైనట్టి శాంతి, సోషలిస్టు శిబిరం ఒకటి ఈనాడు ఉండడమే అందుకు కారణం. సోషలిస్టు దేశాల్లో యుద్ధాన్ని అభిలషించే వర్గాలు లేవు, ముఠాలు లేవు, వ్యక్తులూ లేరు. సోవియట్ యూనియన్‌ని సందర్శించడానికి వచ్చిన విదేశీయులు — వీరిలో సోషలిజానికి వ్యతిరేకులైనవారు సహితమూ — ఆ దేశంలో యుద్ధాన్ని సమర్థించేవారు లేరనీ, సోవియట్ ప్రజలు శాంతికై నిలబడతారనీ ఒప్పుకుంటున్నారు.

యుద్ధాన్ని వారించేందుకు వీలుంది, అంతర్జాతీయ ఘటనలపై సోషలిస్టు రాజ్యాల ప్రభావమూ, దీనికి తోడుగా వలస పరాధీనతనుండి తమ విముక్తిని ఇటీవల సాధించుకున్న ఆసియా, ఆఫ్రికా రాజ్యాల ప్రభావమూ నానాటికి బలపడుతూండడమూ, కోట్లమీద అధికమవుతూన్న సంఖ్యలో నూతన ప్రజలు శాంతి ఉద్యమంలో పాల్గొంటూండడంచేత అన్ని దేశాల్లోనూ శాంతి ఉద్యమం వృద్ధి చెందుతూండడమే ఇందుకు కారణం. సామ్రాజ్యవాద శక్తులకంటె సోషలిస్టు శక్తులే, యుద్ధశక్తులకంటె శాంతిశక్తులే నానాటికి బలపడుతూండడంవల్ల, సామ్రాజ్యవాద దోపిడిదొంగలు మానవజాతికే వ్యతిరేకంగా తలపెట్టిన అకృత్యాలు నెగ్గవనే ఆశ ప్రజలలో పాదుకుంటూంది. "ఈ భూప్రపంచంమీద ఒక సువిశాల శాంతి మండలం రూపొందింది," అని సోవియట్ యూనియన్ కమ్యూనిస్టు పార్టీ నూతన కార్యక్రమం చెబుతూంది; ఆ శాంతి మండలాన్ని రూపొందించుతూన్న శక్తులు సామ్రాజ్యవాదులకు కళ్లెం బిగించేందుకు ధైర్యంతోనూ, నిస్స్వార్థంగానూ, నానాటికి మరింత క్రియాశీలంగానూ పోరాడుతున్నాయి. 1962 జూలైలో సమావేశమైన సాధారణ, సంపూర్ణ నిరా

యుధీకరణ, శాంతి స్థాపనార్థం సర్వప్రపంచ మహాసభకు 120 పైచిలుకు దేశాల ప్రతినిధులు హాజరయారు; సాధారణ, సంపూర్ణ నిరాయుధీకరణకూ, శాంతి స్థాపనకూ క్రియాశీలమైన పోరాటంలో పాల్గొనవలసిందిగా ప్రజలందరకూ ఆ మహాసభ పిలుపు ఇచ్చింది.

నిరుపమానమైన దూరదృష్టితో భవిష్యత్తును వీక్షించగల్గిన ఆ మహనీయుడు మానవతావాది, జ్ఞానసంపన్నుడైన ఆ రాజ్య ధురంధరుడు — లెనిన్ భావాలు నేటి పోరాటంలో పాల్గొంటున్నాయి. ఈ భావాలను గురించిన విజ్ఞానం శాంతి రక్షణ కోసమూ, న్యూక్లియర్ యుద్ధాల నివారణకూ, మానవాళికి యుద్ధాలనుండి విముక్తిని కల్గించే సోషలిజం విశ్వవ్యాప్త విజయానికీ పోరాడేవారందరి బలశక్తులనూ మరింతగా సుసంపన్నం చేస్తుంది.

శాంతిపై నివేదిక

అఖిల రష్యా రెండవ కార్మిక, సైనిక ప్రతినిధుల సోవియట్ల మహాసభలో ఇచ్చినది

అక్టోబరు 26 (నవంబరు 8), 1917

శాంతి సమస్య ప్రాణతుల్యమైన సమస్య, ఈనాటి సమస్యలలో బాధాకరమైన సమస్య. ఈ విషయం గురించి చెప్పడమూ రాయడమూ చాలా జరిగింది. దీనిమీద మీరందరూ కూడా విశేషంగా చర్చించే వుంటారన్నది నిస్సందేహమే. అందుచేత మీరు ఎన్నుకున్న ప్రభుత్వం ప్రకటించాల్సి వున్న ప్రకటనను మీ ఎదుట చదివేందుకు నాకు అనుమతివ్వాల్సిందిగా మిమ్మల్ని కోరుతున్నాను.

శాంతిని గురించి ఉత్తర్వు

ధర్మబద్ధమైనట్టి ప్రజాస్వామికమైనట్టి శాంతి కోసమై తక్షణమే సంప్రతింపులు ప్రారంభించాల్సినదిగా అక్టోబరు 24–25 విప్లవంచే సృష్టించబడినట్టి, కార్మిక సైనిక రైతుల ప్రతినిధుల సోవియట్లను ప్రాతిపదికగా కల్గివుంటూన్నట్టి కార్మికుల, రైతుల ప్రభుత్వం యుద్ధం సాగించుతూన్న అందరి ప్రజలకూ, వారి ప్రభుత్వాలకూ ప్రతిపాదించుతూంది.

యుద్ధం మూలాన అలసి, నిస్త్రాణ చెంది, హింసల పాలైనట్టి అన్ని దేశాల కార్మిక, శ్రమజీవి వర్గాలలోని అత్యధికసంఖ్యాకవర్గం ఆకాంక్షించుతూన్నట్టి ధర్మబద్ధము, లేక ప్రజాస్వామికము అయిన శాంతి — జారిస్టు ఏకరాజాధిపత్యాన్ని తాము కూలదోసిన నాటి నుండి రష్యన్ కార్మికులూ రైతులూ అతి నిష్కర్షగానూ పట్టుదలతోనూ కోరినట్టి శాంతి — అని చెప్పడంలో, అన్యాక్రమణలు లేనట్టి (అనగా, పరదేశీయ భూభాగాల బలాత్కార స్వాధీనం లేనట్టి, పరప్రజల బలాత్కార సంలీనీకరణ లేనట్టి), కప్పముల చెల్లింపులు లేనట్టి తక్షణ శాంతి అని ప్రభుత్వం భావించుతూంది.

ఇట్టి శాంతిని తక్షణమే స్థాపించవలసివదిగా యుద్ధం సాగించుతూన్న అన్ని దేశా లకూ రష్యాదేశ ప్రభుత్వం ప్రతిపాదించుతూ, అన్ని దేశాలయొక్క, అన్ని జాతులయొక్క సంపూర్ణాధికారయుతములైన ప్రజాప్రతినిధి సమావేశాలచే ఇట్టి శాంతి షరతులన్నీ అంతిమ స్థిరీకరణ పొందే లోపల, ఎట్టి కాలహరణమూ లేకుండా ఇందుకై వెంటనే కృతనిశ్చయంతో అన్ని చర్యలనూ తీసుకుందుకు తన సంసిద్ధతను తెలియపరచుతూంది.

పరదేశీయ భూభాగాల అన్యాక్రమణ, లేదా బలాత్కార స్వాధీనమూ అంటే, చిన్న దైనట్టీ, లేదా బలహీనమైనట్టీ ఒక ప్రజను ఆ ప్రజయొక్క కచ్చితమైనట్టీ, స్పష్టమై నట్టీ, స్వచ్ఛందంగా తెలియజేయబడినట్టీ అంగీకారమూ కోర్కె లేకుండానే పెద్దదైనట్టీ, లేక శక్తివంతమైనట్టీ ఒక రాజ్యం తనలో సంలీనీకరణమునకు, అట్టి బలాత్కార సంలీనీ కరణ జరిగిన కాలంతో నిమిత్తం లేకుండానే, అట్టి రాజ్యంచే బలాత్కారంగా అన్యాక్రమణ చేయబడినట్టి, లేదా తన సరిహద్దులలో బలాత్కారంగా అట్టిపెట్టుకోబడినట్టి జాతియొక్క అభివృద్ధి స్థాయితో, లేదా బడుగుతనపు స్థాయితో నిమిత్తం లేకుండానే, ఇక చిట్టచివరకు ఈ జాతి యూరప్‌లో వున్నా సరే, లేదా దూరాన సముద్రాంతర దేశాలలో వున్నా సరే అందుతో నిమిత్తం లేకుండానే సంలీనీకరణమునకై కావించే ప్రతి ఒక్క చర్య అని, ప్రజాస్వామ్యవాదు లకు సాధారణంగానూ, అందులోనూ శ్రమజీవి వర్గాలకు ప్రత్యేకంగానూ స్వాభావికమైన ధర్మశీలతకు అనుగుణ్యంగా ప్రభుత్వం భావించుతూంది.

ఏ జాతి అయినా సరే ఒక రాజ్యపు సరిహద్దులలో అట్టిపెట్టుకోబడిన పక్షంలో, ఆ జాతి నిర్దిష్టంగా వెలిబుచ్చిన కోర్కెను లెక్కచేయకుండా — ఈ కోర్కె పత్రికాముఖంగా గానీ, ప్రజాసమావేశాలలోగానీ, పార్టీల నిర్ణయాలలోగానీ, లేక జాతీయ హింసనకు వ్యతి రేకంగా జరిగిన నిరసనలూ తిరుగుబాట్ల రూపంలోగానీ, మరే విధంగా వ్యక్తీకరించబడినప్పటి కైనా సరే ఆ విధంతో నిమిత్తం లేకుండా — ఆ జాతికి తన రాజ్యాంగయంత్ర అస్తిత్వ రూపాల సమస్యను, ఆ జాతిని సంలీనీకృతం చేసుకున్నట్టీ, లేదా సాధారణంగా ఆ జాతికంటె బలో పేతమైనట్టీ వేరొక జాతియొక్క సైనిక బలగాలు సంపూర్ణంగా ఖాళీచేసిన తరువాతనూ, ఎంత స్వల్పమైనా సరే ఎట్టి ఒత్తిడి గానీ ప్రయోగించబడకుండానూ, స్వేచ్ఛాయుతమైన వోటు ద్వారా నిర్ణయించుకునే హక్కు నిరాకరించబడినయెడల, అట్టి సంలీనీకరణ అన్యాక్ర మణే, అనగా బలాత్కార స్వాధీనమే, దౌర్జన్యమే అవుతుంది.

బలోపేతములూ భాగ్యవంతములూ అయిన జాతులు తాము జయించినట్టి బలహీనములైన ప్రజలను తమలో తాము ఎలా పంచుకోవడమనే వివాదాంశం కారణంగా జరుగుతూన్న ఈ యుద్ధాన్ని ఇంకా సాగించడం మానవాళిపట్ల ఒడిగట్టిన అపరాధాలలోకెల్లా మహాపరాధంగా పరిగ ణించుతూ, పైన సూచించబడినట్టి, ఎట్టి మినహాయింపులూ లేకుండా అన్ని జాతులకూ సమా

నంగా వర్తించేటట్టే నిబంధనల ప్రకారం ఈ యుద్ధాన్ని అంతం చేసేందుకుగాను శాంతి నిబంధనలపై తక్షణమే సంతకం చేసేందుకు ప్రభుత్వం తన కృతనిశ్చయాన్ని గంభీరంగా ప్రకటించుతూంది.

అంతేకాకుండా, పైన పేర్కొనబడిన శాంతి షరతులను ఒక అంతిమ ప్రతిపాదనగా తాను భావించడం లేదని ప్రభుత్వం ప్రకటించుతూంది, అనగా మరే ఇతర శాంతి షరతులనైనా పరే పరిశీలించేందుకు ప్రభుత్వం సిద్ధంగా వుంది, కాగా యుద్ధాన్ని సాగించుతూన్న ఏ దేశమైనా సరే అట్టి షరతులను వీలైనంత శీఘ్రంగా ప్రతిపాదించాల్సిందనీ, శాంతి ప్రతిపాదనలు విస్పష్టంగా ఎట్టి ద్వంద్వార్థానికీ తావులేకుండానూ, ఎట్టి రహస్యపు షరతులూ లేకుండానూ వుండాలనీ ప్రభుత్వం ప్రకటించుతూంది.

రహస్యపు దౌత్యనీతికి ప్రభుత్వం స్వస్తి చెబుతూంది, కాగా తనమటుకు, అన్ని సంప్రతింపులనూ బహిరంగంగా సర్వప్రజ ఎదుట జరపడమే తన కృతనిశ్చయమని ప్రభుత్వం ప్రకటించుతూంది. 1917 ఫిబ్రవరినుండి 1917 అక్టోబరు 25 వరకూ భూస్వాముల, పెట్టుబడిదార్ల ప్రభుత్వం అంగీకరించినట్టి, లేదా స్థిరపరచినట్టి రహస్య సంధులను పూర్తిగా ప్రకటించే కార్యాన్ని ప్రభుత్వం వెంటనే ప్రారంభించబోతూంది. రష్యన్ భూస్వాములకూ పెట్టుబడిదార్లకూ ప్రయోజనాలనూ విశేషాధికారాలనూ సంపాదించిపెట్టే ఉద్దేశంతోనూ, మహారష్యన్లు కావించిన అన్యాక్రమణలను అట్టిపెట్టుకునే ఉద్దేశంతోనూ, లేదా విస్తృత పరచే ఉద్దేశంతోనూ ఈ రహస్య సంధులు — వీటిలో అధికసంఖ్య వాస్తవంగా ఇందుకోసమే — జరిగిన దృష్ట్యా, వీటిలో వున్న ప్రతి విషయమూ నిర్నిబంధంగా తక్షణమే రద్దుపరచబడినట్టు ప్రభుత్వం ప్రకటించుతూంది.

శాంతి స్థాపనకై బహిరంగ సంప్రతింపులను తక్షణమే ప్రారంభించాల్సినదిగా అన్ని ప్రభుత్వాలకూ ప్రజలకూ ప్రభుత్వం విజ్ఞప్తిచేస్తూ, తన వంతుకు తాను ఈ సంప్రతింపులను ఉత్తరప్రత్యుత్తర సంబంధాల ద్వారానూ, టెలిగ్రాపు ద్వారానూ, వివిధ దేశాల ప్రతినిధులతో సంప్రతింపుల ద్వారానూ లేదా ఇట్టి ప్రతినిధుల కాన్ఫరెన్సులోనూ కొనసాగించడానికి ప్రభుత్వం తన సంసిద్ధతను తెలియజేస్తూంది. ఇట్టి సంప్రతింపులకు మార్గం సుగమం చేసేందుకు గాను, ప్రభుత్వం తన పూర్ణాధికార ప్రతినిధిని తటస్థదేశాలకు పంపించుతూంది.

యుద్ధవిరమణ సంధిని తక్షణమే కుదుర్చుకోవలసినదిగా యుద్ధాన్ని సాగించుతూన్న అన్ని దేశాల ప్రభుత్వాలకూ ప్రజలకూ ప్రభుత్వం ప్రతిపాదించుతూంది, కాగా ఈ యుద్ధ విరమణ కాలం కనీసం మూడు నెలలు, అనగా యుద్ధం సాగించుతూవున్నట్టి, లేదా యుద్ధం సాగించేటట్టుగా బలాత్కరించబడినట్టి, ఎట్టి మినహాయింపులూ లేకుండా అన్ని దేశాల ప్రజల, జాతుల ప్రతినిధులు పాల్గొని శాంతి సంప్రతింపులను పూర్తిచేసేందుకున్నూ,

శాంతి షరతుల అంతిమ స్థిరీకరణకుగాను అన్ని దేశాలయొక్క సంపూర్ణాధికారయుతములైన ప్రజాప్రతినిధి సమావేశాలను సమావిష్టపరచేందుకున్నూ అవకాశం కల్గించేందుకు తగినంత కాలవ్యవధి వుండడం వాంఛనీయమని ప్రభుత్వం అభిప్రాయపడుతూంది.

ఈ ప్రతిపాదనను యుద్ధాన్ని సాగించుతూన్న అన్ని దేశాల ప్రభుత్వాలకూ ప్రజలకూ విజ్ఞప్తిచేస్తూ, రష్యాదేశపు తాత్కాలిక కార్మికుల, రైతుల ప్రభుత్వం మానవాళిలో అత్యంత పురోగాములైనట్టి మూడు జాతుల, ప్రస్తుత యుద్ధాన్ని సాగించుతూన్న రాజ్యాలన్నిటిలోనూ పెద్దవైనట్టి మూడు రాజ్యాల, అనగా గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్సు, జర్మనీల వర్గచైతన్యవంతులైన కార్మికులకు ప్రత్యేకంగా విజ్ఞప్తిచేస్తూంది. ఈ దేశాల కార్మికులు అభ్యుదయానికీ, సోషలిజానికీ ఎనలేని సేవ చేశారు; ఇంగ్లండులోని చార్టిస్టు ఉద్యమమూ, ఫ్రెంచి శ్రామిక వర్గం సాధించినట్టి ప్రపంచ చారిత్రక ప్రాముఖ్యతను వడసిన విప్లవాలూ, చిట్టచివరకు జర్మనీలో సోషలిస్టు వ్యతిరేక చట్టంపై జరిపిన వీరోచిత పోరాటమూ, శ్రామికవర్గ ప్రజారాసి ఆర్గనైజేషన్లను జర్మనీలో సృజించేందుకు ఆవశ్యకమైనట్టి దీర్ఘకాలిక, నిరంతర, సుశిక్షిత కృషి, ఇత్యాది మహత్తర దృష్టాంతాలను వీరు సమకూర్చారు. శ్రామికవర్గ శౌర్యానికీ, చారిత్రకమైన సృజనాత్మక కృషికీ చిహ్నములైన ఈ దృష్టాంతాలన్నీ యుద్ధం తెచ్చిపెట్టే ఘోరాలనుండీ, దాని అనుషక్తములనుండీ మానవాళిని రక్షించాల్సినట్టి తమ ఎదుట వేడున్న గురుతర కర్తవ్యాన్ని పైనపేర్కొన్న దేశాల కార్మికులు అర్థం చేసుకుంటారనీ, సర్వతోముఖమైనట్టి కృతనిశ్చితమైనట్టి నిస్స్వార్థమైనట్టి శక్తివంతమైన తమ కార్యాచరణ ఫలితంగా శాంతిని స్థాపించే కార్యాన్నీ, అదే సమయంలో అన్ని రకాల బానిసతనంనుండీ అన్ని విధాల దోపిడీ విధానంనుండీ శ్రమజీవులైనట్టి దోపిడీకి గురికాబడినట్టి ప్రజారాసులకు విముక్తి చేకూర్చే కార్యాన్నీ మనం విజయవంతంగా సాధించడంలో మనకు చివరకంటా సహాయపడతారనీ భావించేందుకు హామీ ఇస్తున్నాయి.

* * *

అక్టోబరు 24–25 విప్లవంచే సృష్టించబడినట్టీ, కార్మిక సైనిక రైతుల ప్రతినిధుల సోవియట్లపై ఆధారపడుతూనట్టీ కార్మికుల, రైతుల ప్రభుత్వం శాంతికై సంప్రతింపులను తక్షణమే ప్రారంభించి తీరాలి. మన విజ్ఞప్తిని ప్రభుత్వాలకూ ప్రజలకూ కూడా మనం అందజేయాలి. ప్రభుత్వాలను మనం ప్రత్యాఖ్యానించకూడదు, ఎందుచేతనంటే అలా చేసినయెడల శాంతిని స్థాపించే అవకాశానికి కాలయాపన కల్గించడమే అవుతుంది, కాగా ప్రజా ప్రభుత్వం అలాంటి పని చేయడానికి సాహసించ నేరదు; కాని అదే సమయంలో ప్రజలకు విజ్ఞప్తి చేయకుండా వుండడానికి మనకు ఏ మాత్రమూ హక్కులేదు. ప్రభుత్వాలకూ

ప్రజలకూ విభేదాలు సర్వత్రా వుంటూనే వున్నాయి, కాబట్టి యుద్ధమూ శాంతీ సమస్యలలో ప్రజలు జోక్యం కలుగజేసుకునేందుకు వారికి మనం సహాయపడాలి. అన్యాక్రమణలూ కప్పములూ లేని శాంతి కోసమై మన కార్యక్రమం సంపూర్ణంగా అంగీకరించబడాలనే మనం సహజంగానే పట్టుపడతాం. ఈ స్థానంనుండి మనం ఎంతమాత్రమూ తిరోగమించం; కాని వారి షరతులకీ మన షరతులకీ భేదం వుందనీ, తత్కారణంగా మనతో సంప్రతింపులు ప్రారంభించడం నిష్ప్రయోజనమనీ వారు చెప్పగల్గే అవకాశాన్ని మన శత్రువులకు మనం ఇవ్వకూడదు. ముమ్మాటికీ ఇవ్వకూడదు, వారికి అట్టి ప్రయోజనకరమైన స్థానం లేకుండా చేయాలి మనం, కాగా మన షరతులను ఒక అంతిమ ప్రతిపాదన రూపంలో మనం అందివ్వకూడదు. ఇందుచేతనే ఎట్టి శాంతి షరతులనైనా సరే, ఎట్టి ప్రతిపాదనలైనా సరే మనం పరిశీలించుతామనే విషయాన్ని మన సూచనలలో మనం చేర్చుతున్నాం. అన్ని షరతులనూ అన్ని ప్రతిపాదనలనూ మనం పరిశీలించుతాం, అయితే అంతమాత్రాన వాటిని మనం అంగీకరించి తీరుతామని అర్థంకాదు. ఎట్టి రాయితీలను చూపించేందుకు వీలుంటుందో, ఎట్టివి చూపించేందుకు వీలుపడదో నిర్ణయించే అధికారాన్ని ఇదివరకే కల్గివుంటూన్న రాజ్యాంగ పరిషత్తు సమావేశం పరిశీలనార్థం వాటిని మనం సమర్పించుతాం. శాంతి, ధర్మాలను కేవలం శుష్కవాక్కులతోనే పూజించుతూ, వాస్తవానికి అన్యాక్రమణ సహితమైన దోపిడీ యుద్ధాలను సాగించే ప్రభుత్వాలు ఆచరించే మోసాలతో మనం పోరాడుతాం. తన మనస్సులో వున్న దానినంతనూ ఏ ప్రభుత్వమూ బయటికి చెప్పదు. మనం మాత్రం రహస్య దౌత్యనీతికి వ్యతిరేకులం, మనం బహిరంగంగా ప్రజలందరి ఎదుట వ్యవహరిస్తాం. కష్టాల ఎదుట మనం కళ్ళు మూసుకోం, అలా ఎన్నడూ మూసుకోనూ లేదు కూడా. మేము యుద్ధం చేయం అని నిరాకరించినంత మాత్రాన యుద్ధం ఆగిపోదు, యుద్ధాన్ని ఒక పక్షమే అంతం చేయజాలదు. మూడు నెలల పాటు యుద్ధవిరమణ సంధిని మనం ప్రతిపాదిస్తున్నాం, కాని అంతకంటె తక్కువ వ్యవధి చిక్కినా సరే ఆ మాత్రం సేపైనా స్వేచ్ఛగా ఊపిరి పీల్చుకోడానికి పూర్తి అవకాశం దొరుకుతుంది; అంతేకాకుండా షరతులు చర్చించబడేందుకుగాను నాగరిక దేశాలన్నిటిలోనూ ప్రజా సమావేశాలను సమావిష్టపరచాల్సి వుంటుంది కూడా.

యుద్ధవిరమణ సంధిని తక్షణమే కుదుర్చుకోవాలని ప్రతిపాదించడంలో, శ్రామిక వర్గ ఉద్యమాభివృద్ధికై ఎనలేని కృషి చేసిన దేశాలలోని వర్గచైతన్యయుతులైన కార్మికులకు మనం విజ్ఞప్తి చేస్తున్నాం. చార్టిస్టు ఉద్యమం వెలసిన ఇంగ్లండు దేశపు కార్మికులకూ, తమ వర్గచైతన్య శక్తిని తిరుగుబాట్ల రూపంలో ప్రదర్శించిన ఫ్రాన్సుదేశపు కార్మికులకూ, సోషలిస్టువ్యతిరేక చట్టంపై పోరాటాన్ని లేవదీసినట్టి బలవత్తరములైన ఆర్గనైజేషన్లను సృజించినట్టి జర్మనీ దేశపు కార్మికులకూ మనం విజ్ఞప్తి చేస్తున్నాం.

మార్చి 14 ప్రణాళికలో[2] బ్యాంకర్లను పడగొట్టాలని మనం పిలుపు ఇచ్చాం, కాని మన బ్యాంకర్లను మనం పడగొట్టకపోగా, వాళ్లతోనే మనం పొత్తు కుదుర్చుకున్నాం కూడా. ఇప్పుడు మనం బ్యాంకర్ల ప్రభుత్వాన్ని పడగొట్టేశాం.

ప్రభుత్వాలూ బూర్జువావర్గమూ తమ బలాలను సమైక్యపరచుకుని, కార్మిక కర్షకుల విప్లవాన్ని రక్తపు మడుగులలో అణచివేయడానికి సర్వశక్తులూ ఉపయోగించుతాయి. కాని మూడు సంవత్సరాల యుద్ధం ప్రజారాసులకు చక్కని గుణపాఠం నేర్పింది. ఇతర దేశాల్లో సోవియట్ ఉద్యమాన్నీ, హంతకుడు విల్‌హెల్మ్‌యొక్క విద్యార్థి ఆఫీసర్లచే క్రూరంగా అణచివేయబడిన జర్మన్ నౌకాదళపు తిరుగుబాటునీ మనం చూశాం. చిట్టచివరకు ఏ ఆఫ్రికా కీకారణ్యాలలోనో కాకుండా, అన్ని విశేషాలూ ఉత్తరక్షణంలో తెలిసిపోయే యూరప్‌లో నివసిస్తున్నామని మనం జ్ఞాపకం వుంచుకోవాలి.

కార్మికోద్యమం విజయం పొందుతుంది, శాంతికీ సోషలిజానికీ మార్గాన్ని అది సుగమం చేస్తుంది. (సుదీర్ఘ కరతాళ ధ్వనులు.)

"సెంట్రల్‌ఎగ్జిక్యూటివ్ కమిటీ ఇజ్వేస్తియ" వార్తాపత్రిక నెం. 208, అక్టోబరు 27, 1917. "ప్రావ్‌ద" నెం. 171 నవంబరు 10 (అక్టోబరు 28), 1917	వి.ఐ. లెనిన్ "రచనలు", 4 వ రష్యన్ కూర్పు, 26 వ సంపుటి, పుటలు 217 — 221

శాంతి నివేదికపై చర్చ అనంతరం ముగింపు ఉపన్యాసం

అఖిల రష్యా రెండవ కార్మిక, సైనిక ప్రతినిధుల సోవియట్ల మహాసభలో ఇచ్చినది

అక్టోబరు 26 (నవంబరు 8), 1917

ప్రకటన సాధారణ స్వభావం గురించి నేను ప్రస్తావించడంలేదు. అందులో వున్న అప్రాముఖ్యములైన విషయాలను మీ మహాసభ నెలకొల్పుతూన్న ప్రభుత్వం సవరించవచ్చు.

మన శాంతి కోర్కెకు అంతిమప్రతిపాదన రూపం ఇచ్చే ప్రయత్నాన్ని నేను కృత నిశ్చయంతో ప్రతిఘటిస్తాను. అంతిమప్రతిపాదన స్వభావం మన కార్యావికంతటికీ గొడ్డలి పెట్టుగా పరిణమించవచ్చు. మన డిమాండ్లలోని ఏ అప్రాముఖ్యములైన విషయాలను సహితమూ మార్చకపోవడమును అవకాశంగా తీసుకుని, మన సమరసరాహిత్యం సాకుగా మనతో శాంతి సంప్రతింపులు సాగించకూడదనే అవకాశాన్ని వారికి కలుగజేయడమును మనం అంగీకరించ కూడదు.

మన విజ్ఞప్తిని సర్వేసర్వత్రా పంపించుతాం, అందరూ దానిని తెలుసుకుంటారు. మన కార్మికుల రైతుల ప్రభుత్వంచే ప్రతిపాదించబడిన షరతులను మరుగుపరచడం ఎవ్వరికీ సాధ్యం కాదు.

బ్యాంకర్ల, భూస్వాముల ప్రభుత్వాన్ని కూలదోసినట్టి మన కార్మిక కర్షకుల విప్లవాన్ని మరుగుపరచడం ఎంతమాత్రమూ సాధ్యంకాదు.

మన సూచనలు అంతిమప్రతిపాదన స్వభావాన్ని కలిగివుండే పక్షంలో ప్రభుత్వాలు ప్రత్యుత్తర మివ్వకపోవచ్చు; మన మిప్పుడు రూపొందించిన పాఠానికి మాత్రం వారు ప్రత్యుత్తర మివ్వాల్సే వుంటుంది. తమ ప్రభుత్వాల మనస్సులలో ఏముంటుందో ప్రతివారినీ తెలుసు కోనీయండి. మనకి ఏ రహస్యాలూ అవసరంలేదు. ప్రభుత్వం ఎల్లప్పుడూ తన దేశంలోని ప్రజాభిప్రాయపు అదుపు ఆజ్ఞలకు లోబడే వుండాలని మనం కోరుతాం.

మన సూచనలు అంతిమప్రతిపాదన స్వభావం కల్గివుండిన కారణంగా వేరొక ప్రభుత్వం ఏమిటి కావాలంటూందో తనకు తెలియకపోయిన పక్షమందు ఏ మారుమూల గుబేర్నియాలో వున్న రైతు ఏమంటాడు? "కామ్రేడ్స్, ఎటువంటి శాంతి షరతులను ప్రతిపాదించేందుకూ కూడా వారికి అవకాశం ఇవ్వకుండా ఎందుకు చేశారు మీరు? ఆ షరతులను నేను చర్చించి వుండేవాణ్ణి, వాటిని పరిశీలించి వుండేవాణ్ణి, అప్పుడు వాటిపట్ల ఎట్టి వైఖరి అవలంబించాల్సి వుండేదో రాజ్యాంగ పరిషత్తు సమావేశంలో నా ప్రతినిధిని ఆదేశించి వుండేవాణ్ణే. ప్రభుత్వాలు* గనుక ఒప్పుకోని పక్షమందు ధర్మబద్ధములైన షరతుల కోసం విప్లవమార్గాన పోరాడ్డానికి నేను సిద్ధమే, కాని ఏమో కొన్ని దేశాలు షరతులు ఎలా వుండవచ్చునంటే, వాటి కోసం తప్పకుండా తామే ఇంకా యుద్ధం సాగించాల్సిందేనని ఆ ప్రభుత్వాలకు సూచించేందుకు నేనే సిద్ధపడొచ్చు కూడా. మన ఉద్దేశాలు సంపూర్ణంగా వాస్తవరూపం ధరించడం పెట్టుబడిదారీ వ్యవస్థ కూలదోయబడడంపైనే కేవలమూ ఆధారపడి వుంటుంది," అని ఆ రైతు అనవచ్చు. బూర్జువావర్గంయొక్క, ప్రభుత్వాలకు నాయకత్వం వహించుతూన్న కిరీటధారులైనట్టీ, కిరీటధారులు కానట్టీ కసాయి అధినేతలయొక్క యావత్తు దౌష్ట్యాన్నీ, యావత్తు నైచ్యాన్నీ బట్టబయలు చేయడమే మన ముఖ్యకర్తవ్యమైనప్పుడు స్వల్పవిషయాలలో అత్యధికమైన రాజీవ్యతిరేకతను ప్రదర్శిస్తున్నామని మనపై అతడు నింద మోపవచ్చు కూడా.

మన రాజీవ్యతిరేకతను ప్రభుత్వాలు చాటుగా ఉపయోగించుకుని, తమ ప్రజలను అవి ఎందుకు కసాయి కబేలాకు తోలుతున్నాయో వారితో చెప్పకుండా దాచిపెట్టే వుంచే అవకాశాన్ని వాటికి మనం ఎంతమాత్రమూ ఇవ్వరాదు, ఎంతమాత్రమూ ఇవ్వకూడదు. ఇదొక నీటిబొట్టు, అయినప్పటికీ బూర్జువా విజిగీష శిలను తొలిచివేయగల్గే యీ నీటిబొట్టును మనం తిరస్కరించరాదు, తిరస్కరించకూడదు. మన ప్రతిపాదనలు అంతిమప్రతిపాదన స్వభావాన్నే గనుక కలిగివుండినట్టయితే, మన ప్రత్యర్థుల పరిస్థితే సులువైపోతుంది. కాని మన షరతులన్నిటినీ మనం ప్రజలకి తెలియచేరుద్దాం. మన షరతులతో మనం అన్ని ప్రభుత్వాల ఎదుటా నిలబడుతాం, ఇక అప్పుడు ఆ ప్రభుత్వాలనే వాటి ప్రజలకు జబాబు చెప్పుకోనీయండి. మన శాంతి షరతులన్నిటినీ రాజ్యాంగ పరిషత్తు సమావేశం ఎదుట నిర్ణయానికై మనం సమర్పించుతాం.

కామ్రేడ్స్, మీరు అత్యంత శ్రద్ధ చూపాల్సిన విషయం ఒకటుంది. రహస్య సంధులన్నీ ప్రకటించబడాలి[8]. అన్యాక్రమణలకూ, కప్పములకూ సంబంధించిన నిబంధనలు

---

* యుద్ధం సాగించుతూన్న ప్రభుత్వాలు అని ఉద్దేశం — సం.

రద్దుకాబడాలి. రకరకాల నిబంధనలున్నాయి, కామ్రేడ్స్; అవి ఎటువంటివంటారా, తమలో తాము బందిపోటు దోపిడిని పంచుకుంటూ ప్రభుత్వాలు చేసుకున్నవే కాకుండా, తమలో తాము చేసుకున్న ఆర్థికపు ఒప్పందాలూ, ఇరుగు పొరుగు దేశాల మధ్య వుండాల్సిన స్నేహ సంబంధాలను గురించిన ఇతర నిబంధనలు కూడా వాటిలో వున్నాయి.

ఒడంబడికలకు మనం కట్టుబడి వుండం, ఒడంబడికలలో చిక్కుకొనేందుకు మనం ఒప్పుకోము. దోపిడికీ దౌర్జన్యానికీ సంబంధించిన విషయాలన్నిటినీ మనం తిరస్కరిస్తాం, కాని ఇరుగు పొరుగు దేశాల మధ్య వుండాల్సిన సంబంధాలను నెలకొల్పడం గురించీ, ఆర్థికపు ఒడంబడికలను గురించీ షరతులు వున్న విషయాలన్నిటినీ మనం సంతోషంతో అంగీకరించుతాం, వీటిని మనం తిరస్కరించలేం. మూడు నెలలపాటు యుద్ధవిరమణ సంధిని మనం ప్రతిపాదిస్తున్నాం; సుదీర్ఘ వ్యవధినే మనం ఎంచుకున్నాం, కారణమేమిటంటే ప్రజలు పూర్తిగా అలసిపోయున్నారు, మూడేళ్ళు దాటి నాల్గో యేడు సాగుతూన్న యీ రక్తసిక్తపు కసాయికోతనుంచి విశ్రాంతి కోసం ప్రజలు తహతహ పడుతున్నారు. శాంతి షరతులను ప్రజలు చర్చించేందుకూ, పార్లమెంటు పాల్గొనడంతో సహా వారు తమ అభిప్రాయాలను తెలియజేసేందుకూ, 'వారికి మనం అవకాశం ఇవ్వాల్సి వుంటుందన్న సంగతి మనం అర్థం చేసుకోవాలి; ఇదంతా జరిగేందుకు కొంత వ్యవధి అవసరం. కందకాలలో వున్న సేనకి ఈ నిరంతర మహామారణహోమ సింహస్వప్నం నుంచి విశ్రాంతి కల్గేందుకు సుదీర్ఘమైన యుద్ధ విరమణ సంధినే మనం కోరుతున్నాం; కాని ఇంతకంటెనూ స్వల్పవ్యవధి యుద్ధవిరమణ సంధి ప్రతిపాదనలను మనం తిరస్కరించం, వాటిని మనం పరిశీలించుతాం; నెలరోజులుగానీ, నెల పదిహేను రోజులు గానీ వ్యవధిగల యుద్ధవిరమణ సంధినే మనకు సూచించినట్టయితే, ఆ షరతులను మనం అంగీకరించి తీరాలి. అంతేకాదు, యుద్ధవిరమణ సంధిపైన మన ప్రతిపాదన అంతిమప్రతిపాదన స్వభావాన్ని కలిగి వుండకూడదు, ఎందుచేతనంటే మన రాజీవ్యతిరేకతను ఒక సాకుగా తీసుకుని యావత్తు సత్యాన్నీ ప్రజలనుండి మన శత్రువులు దాచిపెట్టే అవకాశాన్ని వారికి మనం ఇవ్వ దల్చుకోలేదు. మన ప్రతిపాదన అంతిమప్రతిపాదనగా వుండకూడదు, ఎందుచేతనంటే యుద్ధవిరమణ సంధిని వాంఛించని ప్రభుత్వం మహాపరాధం చేసినదవుతుంది. యుద్ధవిరమణ సంధికై మన ప్రతిపాదనను అంతిమప్రతిపాదన రూపంలో చేయనప్పుడే, ప్రభుత్వాలు మహాపరాధం చేస్తున్నాయని మనం ప్రజల ఎదుట నిరూపించగల్గుతాం, అట్టి మహాపరాధులకు ప్రజలు మరే తతంగమూ లేకుండా నిర్దాక్షిణ్యంగా శాస్తి చెబుతారు. మన ప్రతిపాదనలు అంతిమప్రతిపాదన స్వభావాన్ని కల్గివుండకపోవడం మన బలహీనతనే తెలియజేస్తోందన్న ఆక్షేపణ ఒకటుంది, కాని ప్రజాబలం గురించి మాట్లాడేటప్పుడు బూర్జువా కపటాన్నంతనీ విడిచిపెట్టాల్సిన తరుణం ఆసన్నమైంది. బూర్జువా ఉద్దేశంలో ప్రజారాసులు స్వామా

జ్యవాద ప్రభుత్వాల ఆజ్ఞలను గుడ్డిగా శిరసావహించి కసాయి కమేలాకు ఎప్పుడైతే వరుగెత్తుతాయో అప్పుడే బలం గురించి చెప్పేందుకు వీలుపడుతుంది. ప్రభుత్వ యంత్రాంగానికిగల శక్తితో బూర్జువావర్గ పరిపాలకులు తాము ప్రజారాసులను ఎక్కడెక్కడికైతే ఉరికించాలనుకుంటారో అక్కడికల్లా వాటిని ఉరికించగల్గినప్పుడే రాజ్యాంగయంత్రం బలమైనదని బూర్జువా వర్గపు అభిప్రాయం. బలం విషయంలో మన అవగాహన వేరుగా వుంటుంది. మన ఉద్దేశంలో ఎప్పుడైతే ప్రజారాసులు రాజకీయంగా చైతన్యయుతమై వుంటాయో అప్పుడే రాజ్యాంగ యంత్రం బలంగా వుంటుంది. ప్రజారాసులకి ప్రతీదీ తెలిసినప్పుడే, ప్రతి విషయం గురించీ అవి ఆలోచించ గల్గినప్పుడే, ప్రతి కార్యాన్నీ చైతన్యవంతంగా ఆచరించ గల్గినప్పుడే రాజ్యాంగ యంత్రం బలంగా వుంటుంది. అలసట గురించి నిజం చెప్పేందుకు మనం భయపడక్కర లేదు, ఎందుచేతంటే, ఈనాడు ఏ రాజ్యం అలసట చెందకుండా వుంది గనుక? దీని గురించి ఏ జాతి బహిరంగంగా చెప్పకుండా వుంది గనుక? ఈ అలసట కారణంగా కసాయికోత ఇక ఆగిపోవాలని డిమాండు చేస్తూ దీర్ఘకాలంగా విప్లవోద్యమం సాగుతూన్న ఇటలీనే తీసుకోండి... యుద్ధం అంతమైపోవాలని నినాదాలిస్తూ కార్మికుల రాశిప్రదర్శనలు జర్మనీలో జరగడం లేదా? హంతకుడు విల్‌హెల్మ్, అతని బంట్లూ దయాదక్షిణ్యాలు లేకుండా అణచివేసినట్టి జర్మన్ నౌకాదళపు తిరుగుబాటును ప్రేరేపించినది అలసట కాదా? క్రమశిక్షణను నరనరానా వొంటపట్టించుకున్న దేశమైనట్టి జర్మనీలోనే అలసట గురించీ, యుద్ధాన్ని ఆపివేయడం గురించీ ప్రజలు మాట్లాడడం అనే దృగ్విషయం సంఘటిల్లేందుకు సాధ్యమైనప్పుడు, ఆ విషయాన్నే బహిరంగంగా చెప్పేందుకు మనం భయపడ నవసరంలేదు, ఎందుచేతంటే మన దేశానికీ, యుద్ధాన్ని సాగించుతూన్నట్టీ, అంతేకాకుండా యుద్ధాన్ని సాగించనట్టీ దేశాలు అన్నిటికీ ఇదే వర్తించుతూందన్న విషయం యథార్థం.

"ప్రావ్‌ద", నెం. 171
నవంబరు 10
(అక్టోబరు 28) 1917

వి.ఐ. లెనిన్, "రచనలు",
4 వ రష్యన్ కూర్పు, 26 వ సంపుటి,
పుటలు 222–224

సర్వులకూ రేడియో సందేశం

అన్ని రెజిమెంటల్, డివిజనల్, కోర్, సేనా, తదితర కమిటీలకూ, విప్లవ సైన్యానికి చెందిన సర్వసైనికులకూ, విప్లవ నౌకాదళానికి చెందిన సర్వనావికులకూ

యుద్ధం సాగించుతూన్న దేశాలన్నిటితోనూ — మిత్రదేశాలతోనూ, మనపై యుద్ధ చర్యలను సాగించుతూన్న దేశాలతోనూ కూడా — యుద్ధవిరమణను వెంటనేనూ, సలాంఛనంగానూ ప్రతిపాదించాల్సిందని ఆజ్ఞాపించుతూ సుప్రీమ్ కమాండర్-ఇన్-చీఫ్ దుహోనిన్[4]కి ప్రజాకమిస్సార్ల కౌన్సిల్ నవంబరు 7 రాత్రి ఒక రేడియో సందేశం పంపించింది.

ఈ సందేశం సుప్రీమ్ కమాండ్‌కి నవంబరు 8, ఉదయం 5.05 గంటలకు అందింది. సంప్రతింపుల గమనం గురించి ప్రజా కమిస్సార్ల కౌన్సిల్‌కు నిరంతరాయంగా తెలియపరుస్తూండాల్సిందనీ, యుద్ధవిరమణ సంధిని ప్రజా కమిస్సార్ల కౌన్సిల్ ఆమోదించిన తరువాత మాత్రమే సంధిపై చేవ్రాలు చేయాల్సిందనీ దుహోనిన్‌ను ఆజ్ఞాపించడమైంది. అదేసమయంలో పెట్రోగ్రాడ్‌లో వున్న అన్ని మిత్రదేశాల పూర్ణాధికార ప్రతినిధులకూ యుద్ధవిరమణ సంధిని చేసుకుంటామనే ప్రతిపాదన సలాంఛనంగా విన్నవించడమైంది.

నవంబరు 8 సాయంత్రం వరకూ దుహోనిన్ నుండి ఏ జబాబూ అందకపోవడంచేత, జాప్యానికి కారణాలేమిటో డైరెక్ట్ టెలిగ్రాఫ్ లైన్ ద్వారా దుహోనిన్‌నుండి తెలుసుకుందుకు లెనిన్, స్టాలిన్, క్రిలేంకోలకు ప్రజా కమిస్సార్ల కౌన్సిల్ అధికారమిచ్చింది.

సంభాషణ నవంబరు 9 ప్రాతఃకాలం 2 గంటలనుండి 4.30 గంటల వరకూ జరిగింది[5]. తన ప్రవర్తన గురించిన వివరణనూ, ప్రభుత్వ ఆజ్ఞలకు కచ్చితమైన జబాబునూ ఇవ్వకుండా దాటవేసేందుకు దుహోనిన్ అనేక ప్రయత్నాలు చేశాడు, కాని యుద్ధవిరమణకై సలాంఛనమైన సంప్రతింపులను తక్షణమే ప్రారంభించాల్సిందని రూఢిగా ఆజ్ఞాపించే సరికల్లా ఆజ్ఞను మన్నించేందుకు అతడు తిరస్కరించాడు. అందుపైన ప్రభుత్వ ఆజ్ఞలను

మన్నించేందుకు తిరస్కరించినందుకూ, అన్ని దేశాల శ్రామికరాసులపైనా, ప్రత్యేకంగా సేనల పైనా చెప్పనలవికాని కష్టాలను తెచ్చిపెట్టేందుకు కారణమైన ప్రవర్తనను అవలంబించి నందుకూ అతనిని ఉద్యోగంనుండి బర్తరఫు చేసినట్టు రష్యన్ రిపబ్లిక్ ప్రభుత్వం పేరిటనూ, ప్రజా కమిస్సార్ల కౌన్సిల్ ఆదేశాల ప్రకారమూ అతనికి తెలియజేయడమైంది. అదేసమయంలో, కొత్త కమాండర్-ఇన్-చీఫ్ వచ్చేవరకూ, లేదా అతనిచే దుహోనిన్‌నుండి వ్యవహారాలను ఒప్పగించుకునేందుకు నియమితుడైన వ్యక్తి వచ్చేవరకూ తాను కార్యకలాపాలను నడిపించు తూండాల్సిందని దుహోనిన్‌ని ఆజ్ఞాపించడమైంది. ఎన్‌సైన్ క్రిలేంకొను కొత్త కమాండర్-ఇన్-చీఫ్‌గా నియమించడమైంది.

సైనికులారా, శాంతి కార్యం మీ చేతిలోనే వుంది! విప్లవప్రతిఘాతుకులైన జనరల్సు శాంతి మహాకార్యాన్ని భగ్నం చేయకుండా వుండేటట్టు చూడండి, విప్లవ సేనకు అనుచిత మైన సంక్షిప్త న్యాయవిచారణ చర్యలు జరగకుండా నివారించేందుకూ వారిచుట్టూ సైనికు లను కాపలా పెట్టండి, తమపై జరగాల్సి వున్న నేరవిచారణను ఈ జనరల్సు తప్పించుకుని పోకుండా వుండేందుకూ కఠినాతికఠినమైన విప్లవ, సైనిక క్రమాన్ని పాటించండి.

యుద్ధవిరమణ సంప్రతింపులను శత్రువుతో సలాంఛనంగా ప్రారంభించేందుకు గాను యుద్ధశ్రేణిలో వున్న రెజిమెంట్లనుండి ప్రతినిధులను వెంటనే ఎన్నుకోవాలి.

ఆలాగు చేయడానికి ప్రజా కమిస్సార్ల కౌన్సిల్ మీకు అధికార మిస్తూంది.

సంప్రతింపులలో అడుగడుగునా ఏమి జరుగుతూందో మాకు అన్ని విధాలా తెలియ పరుస్తూండండి. అంతిమ యుద్ధవిరమణ ఒప్పందంపై చేవ్రాలు చేసే అధికారం ఒక్క ప్రజా కమిస్సార్ల కౌన్సిల్‌కే ఇవ్వడమైంది.

సైనికులారా, శాంతి కార్యం మీ చేతిలోనే వుంది! అప్రమత్తత, ఆత్మసంయమం, క్రియాశీలత — వీటితో శాంతి కార్యం విజయోపేతమౌతుంది!

రష్యన్ రిపబ్లిక్ ప్రభుత్వం పేరిట

ప్రజా కమిస్సార్ల కౌన్సిల్ అధ్యక్షుడు వి. ఉల్యానోవ్ (లెనిన్)

యుద్ధశాఖ ప్రజా కమిస్సార్ మరియు,

సుప్రీమ్ కమాండర్-ఇన్-చీఫ్ ఎన్. క్రిలేంకొ

1917 నవంబరు 9(22)వ రచన.
1917 నవంబరు 10 వ "సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఇజ్వేస్తియ"లో నెం. 221 ప్రచురించబడింది.

వి. ఇ. లెనిన్, "రచనలు" 4 వ రష్యన్ కూర్పు, 26 వ సంపుటి, పుటలు 279–280

మొదటి అఖిల రష్యా యుద్ధనౌకాదళ మహాసభలో ఇచ్చిన ఉపన్యాసంనుండి

నవంబరు 22 (డిశంబరు 5), 1917

...ఇప్పుడు యుద్ధ సమస్య గురించి ప్రస్తావిస్తాను. దోపిడిగాళ్ళు దోపిడి సొత్తును పంచుకోవడంలో వాళ్ళల్లో వాళ్ళు పడిన విరోధం కారణంగా తటస్థించిన యుద్ధానికి వ్యతిరేకంగా మనం కృతనిశ్చయంతో పోరాటం మొదలుపెట్టాం. ఈ పోరాటం గురించి అన్ని పార్టీలూ ఇంతకుముందే మాట్లాడాయి. కాని మాటలు, వంచన మించి వారు ఒక్క అడుగు ముందుకు వేయలేదు. ఇప్పుడు శాంతి కోసం పోరాటం ఆరంభమైంది. ఇది కష్టమైన పోరాటం. శాంతి స్థాపన సులభమనీ, శాంతి పదాన్ని మనం ఏ పదిసార్లో పునశ్చరణ చేసేసరికల్లా బూర్జువావర్గం శాంతిని వెండిపళ్ళెంలో పెట్టి సువర్ణ తాంబూలంతో కూడా మనకు సమర్పించుతుందని ఎవరైనా నమ్మివుంటే అట్టివాడు వుత్త సత్యకాలపు నాగమ్మ అనే చెప్పాలి. ఇట్టి అభిప్రాయాన్ని బోల్‌షెవిక్‌లకి అంటగట్టినవాడు మోసబుద్ధితోనే ఇలా చేశాడు. కొల్ల సొత్తును పంచుకోవడంలో పెట్టుబడిదార్లు పీకలు పీకలు ఉత్తరించుకుంటున్నారు. యుద్ధాన్ని ఆపాలంటే పెట్టుబడి ఓటమి చెందితీరాలనేది స్పష్టం, కాగా ఈ ఉద్దేశంతోనే సోవియట్ ప్రభుత్వం ఈ పోరాటాన్ని మొదలుపెట్టింది. రహస్య సంధులను మనం ప్రచురించాం, వాటి ప్రచురణను సాగించుతూనే వుంటాం. ఎట్టి ద్వేషమూ, దూషణా మననీ కార్యంనుండి మళ్ళించజాలవు. తమను కసాయి కమేలాకు ఎందుకు తోల్తున్నారో ప్రజలిప్పుడు తెలుసుకొనగల్గుతున్నారని చెప్పి, బూర్జువావర్గపు పెద్దమనుషులు చిందులు తొక్కుతూ వికటాట్టహాసం చేస్తున్నారు. మీదటికొక కొత్త యుద్ధం వస్తుందనీ అందులో రష్యా నిస్సంగి అయిపోతుందనీ వీరు దేశాన్ని బెదరగొట్టుతున్నారు. కాని మనపట్లనూ, మన శాంతి ఉద్యమంపట్లనూ బూర్జువావర్గం కనబరుస్తున్న కిరాతక ద్వేషభావం మనని ఎంత మాత్రమూ విలవరించజాలదు. వారిమధ్య వారు సాగించుకుంటూన్న ఈ యుద్ధం నాల్గో యేడు కూడా సాగేటట్లు ప్రజలను అందులోకి నడిపించేందుకు వారు ప్రయత్నించవచ్చు గాక! అది మాత్రం

వారికి పాధ్యపడదు. ఒక్క రష్యాలోనే కాదు, యుద్ధం సాగిస్తూన్న అన్ని దేశాల్లోనూ కూడా ఆ యా దేశాల సామ్రాజ్యవాద ప్రభుత్వాలకు వ్యతిరేకంగానే పోరాటం ఒకటే పరిపక్వాని కొస్తూంది. దేశాన్నంతనూ ఒక సైనిక శిబిరంగా రూపొందించేందుకని సామ్రాజ్యవాదులు దశాబ్దులుగా ప్రయత్నించిన జర్మనీలో సహితం, ప్రజాగ్రహ చిహ్నాలు పిసరంత కనబడేసరికల్లా వాటిని మొగ్గలోనే తుంచివేసేందుకు ప్రభుత్వ యంత్రాంగం యావత్తూ ఉపయోగించబడుతూన్న జర్మనీలో, అక్కడ సహితమూ నౌకాదళంలో బహిరంగవు తిరుగుబాటు తలెత్తినంత వరకూ పరిస్థితులు వెళ్లాయి. ఈ తిరుగుబాటులో వున్న అంతరార్థం గ్రహించాలంటే, జర్మనీలో పోలీసు నిరంకుశత్వం ఎంత ఉధృతంగా వుందో తెలుసుకోవాలి. అయితేనేమి, ఒకరి పురమాయింపు మీద విప్లవం తటస్థించదు; ప్రజారాసుల ఆగ్రహం బద్దలవడం ఫలితంగా విప్లవం తటస్థించుతుంది. రొమానొవ్, రస్పూతిన్[6] లాంటి జడ బుద్ధుల జట్టుతో సులభంగానే వ్యవహారం తెరిపిచేసుకున్నాం, అయినప్పటికీ కూడా, కిరీట ధారులైనట్టీ కిరీటధారులు కానట్టీ జర్మన్ సామ్రాజ్యవాదుల సుసంఘటితమూ శక్తివంతమూ అయిన ముఠాతో పోరాడడం కనివినియెరుగనంతటి కష్టసాధ్యమైన విషయం. అయినప్పటికీ అన్ని దేశాల విప్లవాత్మకమైన శ్రమజీవులవర్గంతో మనం చేతులు కలిపి పనిచేయగలం, పనిచేయాలి కూడా. సోవియట్ ప్రభుత్వం రహస్య సంధులను ప్రకటించినప్పుడూ, అన్ని దేశాల ప్రభుత్వాలూ దోపిడిదొంగలే అని చూపినప్పుడూ అది ఈ మార్గమే అనుసరించింది. ఇది మాటలతో ప్రచారంకాదు, ఇది క్రియతో ప్రచారం. (బ్రహ్మాండమైన హర్షధ్వానాలు.)

తన ఉపన్యాసం ముగించేముందు ఉపన్యాసకుడు సంధి సంప్రతింపుల[7] సమస్యను ఎత్తుకుని ఇలా అన్నాడు:

పశ్చిమ యుద్ధశ్రేణికీ, ఇటాలియన్ యుద్ధశ్రేణికీ సైన్యాలను తరలించవద్దని మనం చేసిన డిమాండుకు జర్మన్లు ఎప్పుడైతే గోడమీద పిల్లి వాటంగా జబాబు చెప్పారో, అప్పుడు మనం సంప్రతింపులు చాలించుకున్నాం, కాగా కొంతకాలం అయిన తరువాత సంప్రతింపులను పునఃప్రారంభించుతాం. ఇక పోతే, ఎప్పుడైతే ఈ విషయాన్ని మనం సర్వప్రపంచం ఎదుట బహిరంగా చెబుతున్నామో అప్పుడు మన తప్పిదంవల్ల శాంతి సంప్రతింపులు భగ్నం కాలేదని ప్రతి జర్మన్ కార్మికుడూ తెలుసుకుంటాడు. తమను పరిపాలించుతూన్న సామ్రాజ్యవాదపు బందిపోటుదొంగల ప్రభుత్వానికే జర్మన్ కార్మికవర్గం తన అండదండల నివ్వడమే గనుక జరిగిన పక్షమందూ, యుద్ధాన్ని కొనసాగించాల్సిన అవశ్యకతను మనం ఎదుర్కోనాల్సిన పక్షమందూ, పూర్వాపరాలు తెలుసుకోకుండానే, తమ్ము అణగదొక్కిన ప్రభుత్వం యొక్క లక్ష్యాలను తాము నెరవేర్చడంలో అవి ఏమిటో అవి ఎందుకో తెలుసుకోకుండానే మారు మాటలేకుండా తమ రక్తాన్ని చిందించిన రష్యన్ ప్రజలు, సోషలిజం కోసం పోరాడాల్సి వచ్చి

వట్టయితేనూ అంతర్జాతీయ బూర్జువావర్గం తన విచ్చుకత్తులకు బలిపెట్టి జాపుతూవ్న స్వేచ్ఛ కోసం పోరాడాల్సి వచ్చినట్టయితేనూ పదింతలు శక్తితోనూ పదింతలు వీరోచితం గానూ పోరాటంలోకి దిగుతారనడంలో ఏ మాత్రమూ సందేహంలేదు. అయినప్పటికీ, సోష లిజం కోసం సాగించే పోరాట మార్గంలో తటస్థించే అన్ని అవరోధాలనూ అన్ని అడ్డంకు లనూ అధిగమించనున్న అంతర్జాతీయ కార్మిక ప్రజారాసుల సంసక్తిలో మనకు నమ్మకం వుంది. (బ్రహ్మాండమైన హర్షధ్వానాలు.)

"సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఇజ్వేసియ"
నెం. 235, నవంబరు 25,1917

వి.ఐ. లెనిన్, "రచనలు", 4 వ రష్యన్
కూర్పు, 26 వ సంపుటి,
పుటలు 310–311

కర్నల్ రాబిన్స్ పేర ఉత్తరం

మే 14, 1918

కర్నల్ రాబిన్స్‌కు

ప్రియమైన మిస్టర్ రాబిన్స్,

అమెరికాతో మా ఆర్థిక సంబంధాలను గురించిన ప్రాథమిక ప్రణాళికను ఇందుతో జతపరుస్తున్నాను. మా ప్రజా ఆర్థిక సుప్రీమ్ కౌన్సిల్‌లోని విదేశ వర్తకపు కౌన్సిల్‌చే ఈ ప్రాథమిక ప్రణాళిక సవివరంగా తయారు చేయబడింది.

అమెరికన్ విదేశాంగ కార్యాలయంతోనూ, అమెరికన్ ఎగుమతి వ్యాపార విశిష్టులతోనూ మీరు జరిపే సంభాషణలో ఈ ప్రాథమిక ప్రణాళిక మీకు సహాయకారిగా వుండగలదని ఆశించుతున్నాను.

నా హృదయపూర్వకమైన ధన్యవాదాలను స్వీకరించెదరుగాక.

భవదీయుడు, లెనిన్

"Russian-American Relations, March 1917—March 1920, Documents and Papers", New York, p. 204 ("రష్యన్-అమెరికన్ సంబంధాలు, మార్చి 1917—మార్చి 1920, దస్తావేజులు, పత్రాలు," న్యూయార్క్, పుట 204) అనే పుస్తకంలో 1920లో ఇంగ్లీషున మొదట ప్రచురించబడింది.

"సోవియట్ యూనియన్ విదేశాంగ విధానపు దస్తావేజులు", 1 వ సంపుటి, మాస్కో, 1957, తొలిసారి ప్రచురించబడింది. ఆ పుస్తకం 299—300 పుటలలోని వాచకం అనుసరించి అనువదించబడింది.

ఒక అమెరికన్ పత్రికారచయిత ప్రశ్నలకు సమాధానం[10]

నా సమాధానాలు అమెరికా సంయుక్త రాష్ట్రాల వార్తాపత్రికలలో వందకుపైగా ప్రచురించబడుతాయనీ, సమాధానాలు సంపూర్ణంగా ప్రచురించబడుతాయనీ లిఖితపూర్వకంగా ఇచ్చిన వాగ్దానం నెరవేర్చబడుతుందనే షరతు అనుసరించి వన్నడిగిన ఐదు ప్రశ్నలకూ నేను సమాధానాల నిస్తున్నాను.

1. సోవియట్ ప్రభుత్వం వేసుకున్న ప్రభుత్వ కార్యక్రమానికి సంస్కరణతత్వపు స్వభానంలేదు, సోవియట్ ప్రభుత్వం విప్లవాత్మక స్వభావం గల్గిన ప్రభుత్వ కార్యక్రమాన్నే వేసుకుంది. నిజానికి సంస్కరణలంటే తన పరిపాలనను నిలబెట్టుకుంటూన్న పాలకవర్గం నుండి పొందిన సౌకర్యాలు. పాలకవర్గాన్ని కూలదోయడం విప్లవం. కాబట్టి మామూలుగా సంస్కరణతత్వపు కార్యక్రమాలు అనేక పాక్షిక అంశాలతో కూడుకుని వుంటాయి. మా విప్లవాత్మక కార్యక్రమంలో వుండినది నిజంగా ఒకే ఒక సాధారణ అంశం: భూస్వాములూ పెట్టుబడిదార్లూ మోపిన గాటిని వదలించుకోవడం, వారి అధికారాన్ని కూలదోయడం, ఈ దోపిడీదార్లనుండి కార్మికప్రజారాసులను విముక్తిచేయడమూ. ఈ కార్యక్రమాన్ని మేము ఎన్నడూ మార్చలేదు. కార్యక్రమ సాధనకై ఉపలక్షితమైన కొన్ని పాక్షిక చర్యలు తరుచు మార్పులకు లోనవుతూ వచ్చాయి; వాటిని వరుసగా పేర్కొనాలంటే ఒక గ్రంథానికి గ్రంథమే అవసరమవుతుంది. బహుశ అన్నిటికంటే విస్తృత సంఖ్యలో మార్పులకు లోనైనట్టి పాక్షిక చర్యలకు సంబంధించిన సాధారణ అంశం ఇంకొకటుందని మాత్రమే నేనిక్కడ పేర్కొంటాను. ఇదీ ఆ అంశం: దోపిడీదార్ల ప్రతిఘటన అణచివేత. అక్టోబరు 25 (నవంబరు7) 1917 విప్లవం తరువాత బూర్జువా వార్తాపత్రికలనైనా మేము నిషేధించలేదు, టెరర్ ప్రసక్తే లేదు అసలెక్కడా కూడానూ. కేరెన్‌స్కి మంత్రులననేకులనే కాకుండా, మామీద యుద్ధం చేసిన క్రస్నోవ్‌ని సహితం మేము విడుదలచేశాం. దోపిడీదార్లు, అవగా పెట్టుబడిదార్లు, తమ ప్రతిఘటనను బలపర్చుకోవడం ప్రారంభించిన తరువాత మాత్రమే, ఆ ప్రతిఘటనను వ్యవస్థాబద్ధంగా అణచివేయడానికీ, అవసరమైతే టెరర్ ఉపయోగించడానికి సహితమూ పూను

కున్నాం. రష్యాలో దోపిడీదార్ల పరిపాలనను పునరుద్ధరించేందుకు జర్మనీ, బ్రిటన్, జపాన్, అమెరికా, ఫ్రాన్సు దేశాల పెట్టుబడిదార్లతో కలిసి కుట్ర పన్నడం, ఆంగ్లో-ఫ్రెంచి డబ్బుతో చెకొస్లొవాక్‌లకు లంచాలు ఇవ్వడం, జర్మన్, ఫ్రెంచి డబ్బుతో మన్నెర్‌హైమ్, దెనీకిన్ ఇంకా ఇతరులకు[11] లంచాలు పెట్టడం, వగైరా — బూర్జువావర్గం చేసిన ఇలాంటి పనులకు శ్రామికవర్గం ఇచ్చిన ప్రత్యుత్తరమే ఇది. "మార్పు"కు దారితీసినట్టి, కచ్చితంగా చెప్పాలంటే, పెట్రోగ్రాడ్‌లో వున్న బూర్జువావర్గంపై అధికమైన టెరర్‌కు దారితీసినట్టి ఒక సరికొత్త కుట్ర — ఆఫీసరు కుట్రదార్లు క్రాస్నయ గోర్కాను బలప్రయోగంతో హస్తగతం చేసుకోవడమూ, స్విట్జర్లెండ్ రాయబారవర్గ కార్యాలయపు ఉద్యోగులకూ అందులో పనిచేస్తూ వున్న అనేకమంది రష్యన్ ఉద్యోగస్థులకూ లంచాలివ్వడమూ, వగైరా పనులద్వారా పెట్రోగ్రాడ్‌ను తమకు లొంగిపోయేటట్టు చేసేందుకు మెన్‌షెవిక్‌లతోనూ సోషలిస్టు-రివల్యూషనరీలతోనూ కలిసి బూర్జువావర్గం పన్నిన కుట్ర.

2. రష్యాకు వెలుపల వున్న ఆఫ్ఘనిస్థాన్‌లోనూ, ఇండియాలోనూ, ఇంకా ఇతర ముస్లిమ్ దేశాలలోనూ, మా సోవియట్ రిపబ్లిక్ సాగించుతూన్న క్రియాకలాపాలు రష్యాలో వున్న అనేక మహమ్మదీయ ప్రజల మధ్యనూ, రష్యనేతర ప్రజల మధ్యనూ మేము సాగించుతూన్న క్రియాకలాపాల్లాంటివే. ఉదాహరణకు, బష్కీరియా ప్రజలకు రష్యాలో ఒక స్వయంపాలిత రిపబ్లిక్‌ను స్థాపించుకోవడం సాధ్యమయేటట్టు చేశాం, ప్రతి జాతీయత స్వతంత్రంగానూ స్వేచ్ఛగానూ అభివృద్ధి పొందేందుకూ, ఆ యా జాతీయతలలో ప్రతి ఒక్క జాతీయత యొక్క మాతృభాషలోనూ సారస్వతము అభివృద్ధి పరచి వ్యాపింపజేసేందుకూ మా చేతనైనంత వరకూ మేము సహాయం చేస్తున్నాం; వలస జాతులకూ పారతంత్ర్యాన్ని అనుభవించుతూన్న జాతులకూ అణగదొక్కి వుంచబడిన జాతులకూ పూర్తి హక్కులు అనుభవించని జాతులకూ చెంది, ప్రపంచ జనసంఖ్యలో నూరు కోట్లకుపైగావున్న ప్రజలకు, భూమినీ పెట్టుబడినీ ప్రైవేటు ఆస్తిగా కలిగివుండడమును శాశ్వతం చేసేటట్టి, అనగా కొద్దిమంది "నాగరికులైన" పెట్టుబడిదార్లు తమ స్వదేశాలలోనూ ఆసియా ఆఫ్రికా వగైరాలలోని వలసదేశాలలోనూ వున్న కోటానకోటి ప్రజలపై మోపిన గాటిని మరింత హింసాత్మక మొనరించే బూర్జువా-"ప్రజాస్వామిక" రాజ్యాల "పశ్చిమ-యూరపియన్", అమెరికన్ రాజ్యాంగ ప్రణాళికల కంటె సంతృప్తికరంగా వుండే దురదృష్టానికి నోచుకున్న మా సోవియట్ రాజ్యాంగ ప్రణాళికను అనువదించి పంచిపెడుతున్నాం.

3. సంయుక్త రాష్ట్రాలకూ, జపానుకూ సంబంధించినంత వరకూ తమ పెట్టుబడిదార్లను మాత్రమే మరింత ధనవంతులనుగా చేసేటట్టి సిగ్గు బిడియాలులేనట్టి అపరాధములైనట్టి, రష్యాపై కావించబడిన బందిపోటు దండయాత్రను తిప్పికొట్టడమే మా ప్రధాన

రాజకీయ లక్ష్యం. ఈ రెండు దేశాలకూ మేమనేక సార్లు యథావిధిగా ప్రతిపాదనలు చేశాం, కాని వాటికి ప్రత్యుత్తరమైనా ఇవ్వకుండా మామీద ఇంకా యుద్ధాన్నే సాగించుతూ దెనీకిన్, కొల్చాక్[12]లకు సహాయం చేస్తూ, మూర్మన్స్క్, అర్ఖాంగెల్స్క్ నగరాలను దోచుకుంటూన్న జపాన్, అమెరికా సంయుక్త రాష్ట్రాల పెట్టుబడిదారీ బందిపోటు దొంగలను రష్యన్ రైతులు వీరోచితంగా ప్రతిఘటించుతూన్నట్టి ఆ తూర్పు సైబీరియాను మరీ ప్రత్యేకంగా ధ్వంసం చేసి నాశనం చేస్తున్నారు.

ఎట్టి మినహాయింపులూ లేకుండా అన్ని దేశాల కార్మికులతోనూ, శ్రమజీవిరాసుల తోనూ సౌభ్రాతృత్వ మిత్రత్వం — ఇదే, సంయుక్త రాష్ట్రాల, జపాన్ దేశాల ప్రజలతో సహా ప్రజలందరి విషయంలోనూ మేము మీదటికి కూడా అవలంబించబోయే మా ఏకైక రాజకీయ, ఆర్థిక లక్ష్యం.

4. కొల్చాక్, దెనీకిన్, మన్నెర్‌హైమ్‌లతో ఏ షరతులపైన సంధి కుదుర్చుకుందుకు మేము సిద్ధంగా వున్నామో ఆ షరతులను కచ్చితంగానూ, స్పష్టంగానూ, లిఖితపూర్వకంగానూ మేము అనేక సందర్భాల్లో — ఉదాహరణకు, మాతో (మాస్కోలో స్వయంగా నాతో కూడానూ) సంయుక్త రాష్ట్రాల తరఫున సంప్రతింపులు సాగించిన బుల్లిట్‌తోనూ[13] లేఖ రూపంలో నాన్‌సెన్ పేరనూ,[14] ఇంకా ఇతర సమయాల్లోనూ — విశదపరచాం. ఈ పత్రాలను సంపూర్ణంగా ప్రచురించడానికి సంయుక్త రాష్ట్రాల, ఇతర దేశాల ప్రభుత్వాలూ భయపడుతున్నాయంటేనూ, సత్యాన్ని ప్రజలనుండి దాచుతున్నాయంటేనూ అది మా తప్పుకాదు. మా షరతులలో మౌలికమైన షరతును పేర్కొంటాను: కేవలం ఉత్త మాటల్లోనే కాకుండా, నిజమైన శాంతి స్థాపించబడిన పక్షమందు, అనగా ఈ శాంతిని గ్రేట్ బ్రిటన్, ఫ్రాన్సు, సంయుక్త రాష్ట్రాలు, జపాన్, ఇటలీ ప్రభుత్వాలు — దెనీకిన్, కొల్చాక్, మన్నెర్‌హైమ్ వగైరాలు ఈ ప్రభుత్వాల చేతుల్లో కేవలమూ కీలుబొమ్మలే అవడంచేత — సలాంఛనంగా సంతకాలు చేసి, ధ్రువపరచిన పక్షమందు, ఫ్రాన్సుకూ ఇంకా ఇతర దేశాలకూ అప్పులన్నిటినీ చెల్లించడానికి మేము సిద్ధంగా వున్నాం.

5. అన్నిటికంటె ముఖ్యంగా అమెరికన్ ప్రజా అభిప్రాయానికి ఈ కింది విషయం నేను చెప్పదల్చాను:

ఫ్యూడలిజంతో సరిపోల్చి చూస్తే, పెట్టుబడిదారీ విధానం "స్వేచ్ఛ", "సర్వసమానత్వం", "ప్రజాస్వామ్యం", "నాగరికత"ల పథాన చారిత్రాత్మక పురోగతిని సాధించింది. ఐతేనేమి, వేతనపు బానిస వ్యవస్థగానే, ఆధునిక ("modern") బానిసయజమానులైన భూస్వాముల, పెట్టుబడిదార్ల అత్యల్పసంఖ్యాకవర్గం చేతుల్లో కార్మికులు, కర్షకులు, శ్రమజీవుల లక్షోపలక్షలు బానిసతనం అనుభవించే వ్యవస్థగానే అప్పుడూ వుండేది, ఇప్పటికీ

అలానే వుంది. ఫ్యూడలిజంతో సరిపోల్చి చూస్తే, బూర్జువా ప్రజాస్వామ్యం ఈ ఆర్థిక బానిసతనపు రూపాన్ని మార్చింది, తళతళ మెరసిపోతూన్న తెరనొకదానిని దీనికోసం సృష్టించింది, అంతే కాని దీని సారాన్ని మార్పుచేయలేదు, మార్పుచేయజాలదు కూడాను. పెట్టుబడిదారీ విధానమన్నా, బూర్జువా ప్రజాస్వామ్యమన్నా వేతనపు బానిసతనమే.

సాంకేతికశాస్త్రం సాధారణంగానూ, అందులోనూ ప్రత్యేకంగా రవాణా సాధనాలలోనూ, సాధించినట్టి బ్రహ్మాండమైన ప్రగతీ, పెట్టుబడియొక్క, బ్యాంకులయొక్క బృహత్తరాభివృద్ధీ ఫలితంగా పెట్టుబడిదారీ విధానం పండిపోయి, మిగల మాగిపోయింది. దాని ఆయుష్కాలం దాటి అది జీవించుతూంది, అది మానవ ప్రగతికి అత్యంత అభివృద్ధి నిరోధకమైన శృంఖలముగా పరిణమించింది. ఆంగ్లో-ఫ్రెంచి దోపిడిగాండ్ర జట్టా, లేక జర్మన్ దోపిడిగాండ్ర జట్టా ఏ జట్టు సామ్రాజ్యవాద కొల్లసొత్తును కాజేయడమో, వలస దేశాలపై అధికారమూ ఆర్థిక "ప్రభావ మండలాలు", లేదా "పరిపాలనకు ఆదేశాలు", వగైరాలను పొందడమో నిర్ణయించేందుకు జాతులకు జాతులనే కసాయి కమేలాకు తోలేటట్టి పట్టెడు మంది కోటీశ్వరులూ, కుబేరుల చేతిలోని నిరంకుశ శక్తి అయింది.

ఇందుకనే, కేవలం ఇందుకనే 1914–1918 యుద్ధంలో లక్షలాది ప్రజలు మరణించడమో, వికలాంగులు కావడమో సంభవించింది. యుద్ధం ఇదివరకెన్నడూ కనివినియెరుగనంతటి వినాశాన్ని ఎల్లెడలా కలుగజేయడమూ, సర్వత్రా ప్రజలు, "విజేతలైన" ప్రజలు సహితమూ యుద్ధరుణాలకు వడ్డీలు చెల్లించుకొనవలసి వుండడమూ మరీ ముఖ్యమైన కారణమై వుండడంచేత ఈ సత్యాన్ని గుర్తించిన చైతన్యం, అన్ని దేశాల శ్రమజీవి ప్రజారాసులలో అప్రతిహతమైన శక్తివేగాలతో వ్యాపించుతూంది. ఈ వడ్డీ అన్నది ఏమిటి? పెట్టుబడిదార్లు లాభాలను పంచుకోవడమనే ప్రశ్నను పరిష్కరించేందుకు లక్షలాది కార్మికులూ రైతులూ ఒకరి నొకరు చంపుకుని అవిటివాళ్లనుగా చేసుకుందుకు దయతల్చి ఒప్పుకున్నట్టి మహారాజ రాజశ్రీ కోటీశ్వరులకు చెల్లించాల్సిన కోటానుకోట్ల కప్పం.

పెట్టుబడిదారీ విధాన విచ్ఛిత్తి అనివార్యం. ప్రజారాసుల విప్లవ చైతన్యం సర్వత్రా పెరుగుతూంది; ఇందుకు వేనవేల చిహ్నాలు కనుబడుతున్నాయి. ఈ చిహ్నాలలో, ఎంత అప్రాముఖ్యమైనదే అయినప్పటికీ, సామాన్య మానవునికి అతి స్పష్టంగా కనబడేటట్టి ఒక చిహ్నం, శాంతిస్వభావంతో నిరాడంబరంతో పద్ధతులపట్ల భయభక్తులతో మెలగినవాడూ పెట్టీబూర్జువావర్గానికి చెందినవాడూ ఫిలిష్టయినూ పగటు మనిషీ అయి వుండి యుద్ధానికి వెళ్లినట్టి ఆన్రీ బర్బ్యూస్ రాసిన నవలలే. ("Le feu", "Clarté").*

---

* ఆన్రీ బర్బ్యూస్ ఒక ఫ్రెంచి రచయిత (1873–1935); "Le feu" "అగ్ని" అన్నమాట, "Clarté" "స్పష్టత" అన్నమాట — అనువాదకుడు.

ఒక దేశంలో కాకపోతే మరొక దేశంలోనైనా సరే సోషలిజం విజయం పొందకుండా వుండేందుకనీ, అది ఎలాగా వీల్లేదు గనుక "పోనీ మహా అవుతే" అధమపక్షం జరుపులు పెట్టేందుకని, ఇంకా మరికొన్ని లక్షలమంది కార్మికులనూ రైతులనూ పెట్టుబడిదార్లూ, బూర్జువావర్గంవారూ బలిపెట్టి, ఆ విధంగా మూల్యం చెల్లించగల్గుతారు. కాని పెట్టుబడిదారీ విధానాన్ని మాత్రం వారు రక్షించలేరు. కార్మికప్రజలకే, కేవలమూ కార్మికప్రజలకు మాత్రమే అధికారం ఇస్తూన్నట్టే, తమ విముక్తి సాధనకై నాయకత్వాన్ని శ్రామికవర్గానికే ఒప్పగించుతూన్నట్టే, అనేకమందిని కొద్దిమంది దోపిడీ చేయడానికీ రాశిదారిద్ర్యానికీ మూలాధారమూ, జాతుల మధ్య బందిపోటు యుద్ధాలకు, కేవలమూ పెట్టుబడిదార్లను మాత్రమే భాగ్యవంతులనుగా చేసిపెట్టే యుద్ధాలకు మూలాధారమూ ప్రైవేటు ఆస్తే అవుతూన్న కారణాన ప్రైవేటు ఆస్తిని రద్దుపరుస్తూన్నట్టే సోవియట్ రిపబ్లిక్ పెట్టుబడిదారీ విధాన స్థానాన్ని ఆక్రమించింది.

అంతర్జాతీయ సోవియట్ రిపబ్లిక్ విజయం తథ్యం.

ముగించే ముందు చిన్న దృష్టాంతం: తన దేశంలో వున్న స్వేచ్ఛ, సరిసమానత్వం, ప్రజాస్వామ్యం గురించి బడాయిలు కొట్టుతూ అమెరికన్ బూర్జువావర్గం ప్రజను మోసగించుతూంది. కాని ఈ ప్రభుత్వమైనా సరే, మరే ఇతర బూర్జువావర్గపు ప్రభుత్వమైనా సరే, ప్రపంచంలో వున్న ఇంకే ప్రభుత్వమైనా సరే నిజమైన స్వేచ్ఛ, సరిసమానత్వం, ప్రజాస్వామ్యాల ప్రాతిపదికపై మా ప్రభుత్వంతో పోటీకి అంగీకరించజాలదు, అంగీకరించడానికి జడుస్తుంది. మా ప్రభుత్వానికీ మరే ఇతర ప్రభుత్వానికీ, ఏ భాషలోనైనా సరే ఆ దేశపు శాసనాల వాచకాన్నీ, ఇతర దేశాల శాసనాలకంటె తన దేశపు శాసనాల శ్రేష్ఠతను వివరించుతూ ఆ ప్రభుత్వం పేరిట పాంఫ్లెట్లను మార్పిడి చేసుకుందుకు ఒడంబడిక కుదిరిందనుకుందాం.

శాంతియుతమూ, నాగరికమూ, స్వేచ్ఛాయుతమూ, సరిసమానత్వ సహితమూ, ప్రజాస్వామ్యయుతమూ అయినట్టి ఇటువంటి ఒడంబడిక మాతో చేసుకుందుకు ప్రపంచంలో వున్న ఏ ఒక్క బూర్జువావర్గ ప్రభుత్వానికీ ధైర్యం చాలదు.

ఎందుచేతంటే, సోవియట్ ప్రభుత్వాలు తప్ప కడమ అన్ని ప్రభుత్వాలూ ప్రజారాసులను పీడించడం వల్లనే, వాటిని మోసగించడం వల్లనే అధికారంలో నిలబెట్టబడుతున్నాయి. కాని 1914–1918 మహాసంగ్రామం ఈ మహావంచనను బట్టబయలు చేసివేసింది.

లెనిన్

జూలై 20, 1919

"ప్రావ్దా", నెం. 162,
జూలై 25, 1919

వి.ఐ.లెనిన్, "రచనలు", 4 వ రష్యన్ కూర్పు,
29 వ సంపుటి, పుటలు 476–480

అమెరికన్ కార్మికులకు

కామ్రేడ్స్,

సుమారు ఏడాది కిందట అమెరికన్ కార్మికుల పేర (1919 ఆగస్టు 20 తేదీన) నేను రాసిన ఉత్తరంలో[15] సోవియట్ రష్యా పరిస్థితులనూ కర్తవ్యాలనూ వివరించాను. అప్పటికింకా జర్మన్ విప్లవం జరగలేదు. సాధారణంగా 1914–1918 సామ్రాజ్యవాద యుద్ధాన్నీ, ప్రత్యేకంగా ఆంటాంట్-సామ్రాజ్యవాదాన్నీ బోల్షెవిక్‌లు ఎంత సరిగా అంచనా కట్టారో ప్రపంచ చరిత్రలో జరిగిన ఇటీవలి ఘటనలే రుజువుచేశాయి. అప్పటినుండి యావత్తు ప్రపంచ కార్మిక రాసులకూ సోవియట్ రాజ్యాధికారం అంటే ఏమిటో అర్థమై, వాటి హృదయాన్నీ మనస్సునూ అది చూరగొంది. దురహంకారంతోనూ అవకాశవాదంతోనూ పోడుతూన్న తమ ముసలి నాయకుల పలుకుబడిని కార్మికరాసులు సర్వత్రా తోసిపుచ్చి కుళ్లిపురుగులోడుతూన్న బూర్జువా పార్లమెంటుల స్థితినీ, పెట్టుబడిదారీ విధానం మోపిన గాటినుండి మానవాళికి విముక్తిని కల్గించేందుకై సోవియట్ శక్తియొక్క, శ్రమజీవుల శక్తియొక్క, శ్రామిక నియంతృత్వంయొక్క ఆవశ్యకతనూ గ్రహించుకుంటున్నారు. కాగా అన్నిదేశాల బూర్జువావర్గమూ ఎంతగా ఆగ్రహావేశంతో రెచ్చిపోతూ, భీకర ఉన్మత్త ప్రలాపాలు ఎంతగా పేలుతూన్నప్పటికీ కూడా, సోవియట్ శక్తి ప్రపంచమంతటా విజయవంతమవుతుంది. మాపై యుద్ధం సాగించుతూ, పెట్టుబడి గాటిని తిరిగి మోపేందుకు ఆశించుతూన్న విప్లవప్రతిఘాతులను మాపై ఉసికొల్పుతూన్న బూర్జువావర్గం రష్యాని రక్తపు వరదలో ముంచెత్తుతూంది. దిగ్బంధన ద్వారానూ, విప్లవప్రతిఘాతులకు అందజేస్తూన్న సహాయం ద్వారానూ బూర్జువావర్గం రష్యన్ శ్రమజీవిరాసులను ఎనలేని బాధలకు గురిచేస్తూంది, కాని మేము ఇప్పటికప్పుడే కొల్చాక్‌ను ఓడించేశాము, మా భావి విజయం తథ్యమనే దృఢవిశ్వాసంతో దెనీకిన్‌పై యుద్ధం సాగిస్తున్నాం.

23. IX. 1919

ఎన్. లెనిన్

* * *

శాంతి నెలకొల్పబడిన తరువాత మావద్దనుండి వర్తకసంబంధాల పునరారంభమే కాకుండా, రష్యాలో రాయితీలను పొందే అవకాశం కూడా వుంటుందని రష్యాపై యుద్ధాన్ని వ్యతిరేకించుతూన్న అమెరికన్లు — కార్మికులే కాకుండా, ప్రధానంగా బూర్జువావర్గంవారు — ఆశించడం సరైనదేనా అని తరుచు నన్ను అడగడం కద్దు. వారు అలా ఆశించడం సరైనదే అని నేను మళ్ళీ మరొక సారి చెబుతున్నాను. రష్యన్ శ్రమజీవిరాసులకు సుస్థిరశాంతి ఎంతటి ఉపశమనం కల్గించుదంటే, నిర్దిష్టములైన కొన్ని రాయితీలను మంజూరు చేసేందుకు శ్రమజీవిరాసులు నిస్సందేహంగా ఒప్పుకుంటారు. సోషలిస్టు రాజ్యాలూ పెట్టుబడిదారీ విధాన రాజ్యాలూ ఒక దాని సరసను ఒకటి మనుగడ నెరపే కాలంలో సాంకేతిక సహాయాన్ని ఈ రంగంలో మరింతగా పురోగమించిన దేశాలనుండి రష్యాలోకి ఆకర్షించేందుకు ఒక సాధనంగా సబబైన షరతులపై రాయితీలను మంజూరు చేయడం మాకు కూడా వాంఛనీయమే.

ఎన్. లెనిన్

23. IX. 1919

ఇంగ్లీషున "Soviet Russia" మాసపత్రిక, నెం. 30 లో 1919 డిశంబరు 27 న ప్రచురించబడింది.

"ప్రావ్ద", నెం. 308 లో 1930 నవంబరు 7 న రష్యన్ భాషలో తొలి సారి ప్రచురించబడింది.

వి. ఐ. లెనిన్, "రచనలు", 4 వ రష్యన్ కూర్పు, 30 వ సంపుటి, పుటలు 20—21

"THE CHICAGO DAILY NEWS" విలేకరి ప్రశ్నలకు సమాధానం

5/X 1919.

నా ఇంగ్లీషులో తప్పులను క్షమించండి. మీరు వేసిన కొద్ది ప్రశ్నలకూ సంతోషంతో సమాధానమిస్తాను.

1. శాంతి సమస్య విషయమై సోవియట్ ప్రభుత్వపు ప్రస్తుత విధానం ఏమిటి?

2. సోవియట్ రష్యా ప్రతిపాదించిన శాంతి షరతులు క్లుప్తంగా చెప్పాలంటే ఎలా వుంటాయి?

మా శాంతి విధానం వెనుకటిదే, అనగా మిస్టర్ బుల్లిట్ చేసిన శాంతి ప్రతిపాదనను[16] మేము అంగీకరించాం. మిస్టర్ బుల్లిట్‌తో కలిసి సూత్రీకరించిన మా శాంతి షరతులను (2 వ ప్రశ్న) మేము ఎన్నడూ మార్చలేదు.

మిస్టర్ బుల్లిట్ రాకపూర్వం, అనేక సార్లు మేము ఆంటాంట్‌కు శాంతిని అధికార పూర్వకంగా ప్రతిపాదించాం.

3. విదేశ రాజ్యాల ఆంతరంగిక వ్యవహారాలలో కచ్చితమైన నిర్వ్యవధానం పాటించబడుతుందని సోవియట్ ప్రభుత్వం హామీ ఇచ్చేందుకు సిద్ధంగా వుందా?

ఆ హామీ ఇచ్చేందుకు మేము సిద్ధంగా వున్నాం.

4. రష్యన్ ప్రజలో అధికసంఖ్యాకవర్గానికి తాను ప్రాతినిధ్యం వహించుతూ వున్నట్టు రుజువు చేసేందుకు సోవియట్ ప్రభుత్వం సిద్ధంగా వుందా?

అవును, ప్రపంచంలో వున్న ప్రభుత్వాలన్నిటిలోనూ సోవియట్ ప్రభుత్వమే అత్యంత ప్రజాస్వామ్యమైన ప్రభుత్వం. దీనిని రుజువు చేసేందుకు మేము సిద్ధంగా వున్నాం.

5. అమెరికాతో ఆర్థిక ఏర్పాటు విషయమై సోవియట్ ప్రభుత్వం తీసుకుంటూన్న స్థానం ఏమిటి?

అమెరికాతో — అన్ని దేశాలతోనూ కూడా, అయితే అందులోనూ <u>మరీ ముఖ్యంగా</u> అమెరికాతో — ఆర్థిక ఏర్పాటుకి మేము నిశ్చయంగా సముఖులం.

మిస్టర్ బుల్లిట్‌తో మా ప్రభుత్వం స్వీకరించిన మా శాంతి షరతుల పూర్తి పాఠం మీకవసరమైతే మేమివ్వగలం.

వ్లా. ఉల్యానొవ్ (ఎన్. లెనిన్)

"The Chicago Daily News"
నెం. 257 లో 1919 అక్టోబరు 27 న
ప్రచురించబడింది. రష్యన్ భాషలో 1942లో
ప్రచురించబడింది.

వి.ఐ. లెనిన్, "రచనలు",
4వ రష్యన్ కూర్పు,
30 వ సంపుటి, పుటలు 32–33

అంతర్జాతీయ విధాన సమస్యపై ఆర్.సి.పి. (బి.) ఎనిమిదవ అఖిల రష్యా కాన్ఫరెన్స్‌కు సమర్పించిన తీర్మానపు ముసాయిదా[17]

రష్యన్ సోవియట్ ఫెడరేటివ్ సోషలిస్టు రిపబ్లిక్ సర్వజాతులతోనూ శాంతియుతంగా జీవించాలనీ, ఉత్పత్తి, రవాణా, పరిపాలనా వ్యవహారాలను సోవియట్ వ్యవస్థ ప్రాతిపదికపై పునర్నిర్మించుకుందుకుగాను తన యావచ్ఛక్తినీ అంతరంగికాభివృద్ధి కోసం వినియోగించుకోవాలనీ కోరుతూంది; ఆంటాంట్ వ్యవధానమూ, క్షుద్బాధాకరమైన దిగ్బంధనమూ దీనిని ఇంతవరకు జరగకుండా చేశాయి.

కార్మికుల, రైతుల ప్రభుత్వం ఆంటాంట్ రాజ్యాలతో అనేక సార్లు శాంతి ప్రతిపాదనలు చేసింది — 1918 ఆగస్టు 5 న అమెరికన్ ప్రతినిధి మిస్టర్ పూల్ పేర విదేశ వ్యవహారాల ప్రజా కమిస్సారియట్ పంపిన సందేశం; 1918 అక్టోబరు 24 న ప్రెసిడెంట్ విల్సన్ పేర పంపిన సందేశం; 1918 నవంబరు 3 న తటస్థదేశాల ప్రతినిధులద్వారా ఆంటాంట్ ప్రభుత్వాలన్నిటికీ పంపిన సందేశం; 1918 నవంబరు 7 న ఆరవ అఖిల రష్యా సోవియట్ల మహాసభనుండి పంపిన సందేశంలో వున్న ప్రతిపాదన; 1918 డిశంబరు 23 న ఆంటాంట్ ప్రతినిధులందరకూ లిత్వినావ్ స్టాక్‌హోమ్‌నుండి పంపిన లేఖ; తరువాత 1919 జనవరి 12 న, 17 న, ఫిబ్రవరి 4 న పంపిన సందేశాలూ, 1919 మార్చి 12 న బుల్లిట్‌తో కలిసి సమిష్టిగా రూపొందించిన సంధి పత్రపు ముసాయిదా; 1919 మే 7 న నాన్‌సెన్‌ద్వారా పంపిన సందేశమూ.

ప్రజా కమిస్సార్ల కౌన్సిలూ, విదేశ వ్యవహారాల ప్రజా కమిస్సారియటూ తీసుకున్న ఈ చర్యలన్నింటినీ ఏడవ సోవియట్ల మహాసభ పూర్తిగా ధ్రువపరుస్తూ, శాంతికై తన అచంచల వాంఛను మరొకసారి ధ్రువీకరించుతూ, శాంతి సంప్రతింపులను వెంటనే ప్రారంభించాల్సినదిగా ఆంటాంట్ రాజ్యాలైన బ్రిటన్, ఫ్రాన్సు, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఇటలీ, జపాన్‌లతో వ్యక్తిగతంగానూ సమిష్టిగానూ మరొకసారి ప్రతిపాదించుతూంది: ఈ

శాంతి విధానాన్ని వ్యవస్థాబద్ధంగా కొనసాగించాల్సిందని (లేదా, ఈ శాంతి విధాన విజయానికై అవసరమైన అన్ని చర్యలను తీసుకుంటూ ఈ శాంతి విధానాన్ని వ్యవస్థాబద్ధంగా కొనసాగించాల్సిందని) అఖిల రష్యా సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీనీ, ప్రజా కమిస్సార్ల కౌన్సిల్‌నీ, విదేశ వ్యవహారాల ప్రజా కమిస్సారియట్‌నీ మహాసభ ఆదేశించుతూంది.

1919 డిశంబరు 2 న రచించబడింది.
1932 లో తొలి సారి ప్రచురించబడింది.

వి. ఐ. లెనిన్, "రచనలు",
4 వ రష్యన్ కూర్పు,
30 వ సంపుటి,
పుటలు 169–170

ఏడవ అఖిల రష్యా సోవియట్ల మహాసభకు అఖిల రష్యా సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ, ప్రజా కమిస్సార్ల కౌన్సిలూ సమర్పించిన నివేదికనుండి

డిశంబరు 5, 1919

కామ్రేడ్స్, అంతర్జాతీయ రంగంలో మనం సాధించిన విజయాలను గురించి నేను చెప్పినదానినుండి — ఈ విషయమై ఇంకా సవిస్తరంగా వివరించడం అవసరం లేదనే అనుకుంటాను — గరిష్ఠస్థాయి వ్యవహార సరళిలోనూ నిదానంతోనూ మనం పునః పునః మన శాంతి ప్రతిపాదనను చేస్తూండాల్సిందే అనే విషయం వ్యక్తమౌతుంది. ఇటువంటి ప్రతిపాదనను మనం చేసిన ప్రతి సారీ విద్యాగంధమున్న ప్రతి వ్యక్తి దృష్టిలోనూ — అతడు మన శత్రువే అయినప్పటికి సహితమూ — కొంత సుముఖతను మనం సంపాదించుకుంటున్నాం, విద్యాగంధమున్న ఆ వ్యక్తి సిగ్గుతో తల వంచుకుంటున్నాడు. బుల్లిట్ ఇక్కడకు వచ్చినప్పుడూ, ఆయనకు కామ్రేడ్ చిచేరిన్[18] స్వాగతం చెప్పిన తరువాత కామ్రేడ్ చిచేరిన్‌తోనూ నాతోనూ ఆయన భేటీ వేసినప్పుడూ, కొద్ది గంటల సంభాషణ తరువాతనే ప్రావేశిక శాంతి సంధిని కుదుర్చుకున్నప్పుడూ ఇదే జరిగింది. అమెరికాయే సర్వమూ అనీ (బడాయిలు కొట్టడమంటే ఈ పెద్ద మనుషులకు ఎంతో సరదా లెండి), అమెరికాకు వున్న బలం దృష్ట్యా ఫ్రాన్సును ఎవ్వరూ లెక్క చేయరనీ ఆయన మాతో నమ్మకంగా చెప్పాడు. కాని ఒడంబడికపై మేము చేవ్రాలు చేసినప్పుడు ఫ్రెంచి, బ్రిటిష్ మంత్రులు ఈ రకంగా అభినయించారు. (లెనిన్ కాలితో గట్టిగా ఒక తన్ను అన్నాడు. సభలో నవ్వు.) బుల్లిట్ చేతిలో వున్నది ఎందుకూ పనికిరాని కాగితపు ముక్కే అని తేలిపోయింది. ఇక నలుగురూ అతనితో, "నువ్వు బ్రిటిష్, ఫ్రాన్సుల ప్రజాస్వామ్యాన్ని నమ్మేటంతటి సత్యకాలపు మనిషివి బుద్ధిహీనుడవూ అని నిజంగా ఎవ్వరూ అనుకో లేదు సుమా!" అని అనేశారు. (చప్పట్లు.) దీని ఫలితం, అదే వార్తాపత్రిక సంచికలో బుల్లిట్‌తో చేసుకున్న ఒడంబడిక పూర్తి పాఠం ఫ్రెంచిభాషలో నేను చదివాను — ఆ పాఠమే అన్ని బ్రిటిష్, అమెరికన్ వార్తాపత్రికలూ ప్రచురించాయి. ఫలితం ఏమిటంటే, వీరు దగాల్నా

జీలు గానో, తుంటరి కుర్రాళ్ళు గానో — ఆవేదో వాళ్ళనే ఎంచుకోమనండి — ప్రపంచం అంతటి ఎదుట బయటపడిపోయారు. (చప్పట్లు) యావత్తు సానుభూతి, పెట్టీ బూర్జువావర్గపు సానుభూతే కాకుండా, తమ సొంత కైజర్లకూ రాజులకూ వ్యతిరేకంగా తాము ఒకవాడు సాగించిన పోరాటాన్ని జ్ఞప్తికి తెచ్చుకున్నట్టీ, ఒక విధమైన విద్యాగంధం వున్నట్టీ బూర్జువావర్గపు సానుభూతి సహితమూ మన పక్షమే వుంది, కారణం ఏమిటంటే — కఠినాతికఠినమైన శాంతి షరతులపై మనం వ్యవహారసరళిలో చేవ్రాలుచేసి, "మా కార్మికుల, సైనికుల రక్తం మాకు అమూల్యమైనది; వ్యాపారస్థులైన మీకు ఎంతటి అధిక మొత్తమైనా సరే శాంతి కోసం కప్పం చెల్లించుకుందుకు మేము సిద్ధంగా వున్నాం; మా కార్మికుల, రైతుల ప్రాణాలను కాపాడేందుకు అత్యధిక మొత్తంతో కప్పం చెల్లించేందుకు మేం ఒప్పుకుంటాం," అని మనం చెప్పివుండడమే. ఇందుచేతనే ఈ విషయమై మనం ఇక అంతగా ప్రస్తావించడం అవసరంలేదనే నా నమ్మకం, కాగా అచంచల దీక్షతో శాంతి విధానాన్ని అనుసరించడమే మన కోర్కె అని సోవియట్ల మహాసభ పేరిట వ్యక్తం చేస్తూన్న తీర్మానపు ముసాయిదాను[19] నా ఉపన్యాసం ముగించే ముందు మీకు చదివి వినిపిస్తాను. (హర్షధ్వానాలు.)...

"ప్రావ్ద" నెం. 275, 276, 277 గల 1919 డిశంబరు 7,9,10 తేదీల సంచికలలో ప్రచురించబడింది. వి.ఐ. లెనిన్, "రచనలు", 4 వ రష్యన్ కూర్పు, 30 వ సంపుటి, పుటలు 199—200

"NEW YORK EVENING JOURNAL" విలేకరి ప్రశ్నలకు సమాధానం[20]

1. "పోలెండ్, రుమేనియాలపై దాడిచేసే ఉద్దేశం మాకు వుందా?"

లేదు. ప్రజా కమిస్సార్ల కౌన్సిల్, అఖిల రష్యా సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ పేరిట శాంతియుతములైన మా ఉద్దేశాలను అత్యంత గంభీరంగానూ, అధికారపూర్వకంగానూ ఉద్ఘాటించాం. మాపై దాడిచేయాల్సిందని పోలెండ్‌ను (రుమేనియాను కూడా అని అనుమానం కల్గుతూంది) ఫ్రెంచి పెట్టుబడిదారీ ప్రభుత్వం పురికొల్పుతూండడం అత్యంత శోచనీయం. లియోన్‌నుండి వస్తూన్న అనేక అమెరికన్ రేడియోవార్తలు కూడా ఈ విషయాన్ని పేర్కొంటున్నాయి.

2. "ఆసియాలో మా పథకాలా?"

యూరప్‌లో ఏమిటో అవే: నూతన జీవితానికి — దోపిడీదార్లు లేనట్టి భూస్వాములు లేనట్టి, వర్తకులు లేనట్టి జీవితానికి — మేల్కొంటూన్నట్టి అందరి ప్రజలతోనూ, అన్ని జాతుల కార్మికులతోనూ రైతులతోనూ శాంతియుత సహనివాసం నెరవుకోవడం. 1914–1918 సామ్రాజ్యవాద సంగ్రామం, ప్రపంచాన్ని విభజించుకుందుకుగాను జర్మన్-ఆస్ట్రియన్ పెట్టుబడిదార్ల గ్రూపుకి వ్యతిరేకంగా ఆంగ్లో-ఫ్రెంచి (రష్యన్ కూడానూ) పెట్టుబడిదార్ల గ్రూపు సాగించుతూన్న సంగ్రామం ఆసియాను మేల్కొల్పి, సర్వత్రా లాగానే, అక్కడ కూడా, స్వేచ్ఛాభిముఖమైన, శాంతియుత శ్రమాభిముఖమైన, భావి యుద్ధాల బహిష్కరణాభిముఖమైన ఉత్తేజాన్ని పటుతరం చేసింది.

3. "అమెరికాతో శాంతికి ప్రాతిపదికలా?"

అమెరికన్ పెట్టుబడిదార్లు మా జోలికి రాకుండా వుంటే చాలు. మేము వాళ్ల జోలికి వెళ్లం. మా రవాణా వ్యవస్థకీ, పరిశ్రమలకీ ఉపయోగపడే యంత్రాలనూ పనిముట్లనూ

బంగారం ఇచ్చి కొనుక్కోడానికి కూడా మేము సిద్ధంగా వున్నాం. ఒక్క బంగారం ఇచ్చే కాదు, ముడిపదార్థాల రూపేణా కూడానూ.

4. "అటువంటి శాంతికి అవరోధాలు ఏమిటా?"

మా వైపునుండి ఏమీ లేవు. అమెరికన్ (ఇంకా మరెవరైనా ఇతర) పెట్టుబడి దార్ల వైపున వున్న సామ్రాజ్యవాదమే అవరోధం.

5. "రష్యన్ విప్లవకారులను అమెరికానుండి నిర్బంధంగా పంపించివేయడం విషయమై మా అభిప్రాయాలా?"

వారికి మేం స్వాగతం చెప్తాం. వారంటే ఈ దేశంలో మాకేమీ భయంలేదు. వాస్తవానికి మేము ఎవ్వరికీ భయపడం, కాగా మరో వందమందో వెయ్యిమందో తన పౌరులనే చూసి అమెరికా భయపడుతూన్నట్టయితే, ప్రమాదస్థులని అమెరికా భావించుతూన్న ఏ పౌరులనైనా సరే (నేరగాళ్లను మినహాయించే సహజంగానూ) మా దేశంలోకి రానిచ్చేందుకు అమెరికాతో సంప్రదింపులు ఆరంభించడానికి మేము సిద్ధమే.

6. "రష్యా, జర్మనీల మధ్య ఆర్థిక మైత్రికి అవకాశమా?"

దురదృష్టవశాత్తూ గొప్ప అవకాశాలేమీ లేవు. షైడెమాన్ జట్టువాళ్లు చెడు మిత్రులు. ఎట్టి మినహాయింపూ లేకుండా అన్ని దేశాలతో మిత్రత్వాన్నీ మేము సమర్థిస్తాం.

7. "యుద్ధ నేరస్థుల ప్రత్యర్పణ గురించి మా అభిప్రాయమా?"

దీని గురించి గంభీరంగా మాట్లాడదల్చుకునే పక్షంలో, అన్ని దేశాల పెట్టుబడిదార్లూ యుద్ధ నేరస్థులే. వంద హెక్టార్లకుపైగా భూమి వున్న మీ భూస్వాములందరినీ, లక్ష ఫ్రాంకులకుపైగా పెట్టుబడి వున్న పెట్టుబడిదార్లనందరినీ మాకు ఒప్పజెప్పండి, అప్పుడు వారు ఉపయోగకరంగా శ్రమపడేటట్టు వారిని మేము పెంచి వృద్ధిలోకి తెచ్చి, వలసదేశాలను పంచుకుందుకు సాగించే యుద్ధాలను పురికొల్పే దోపిడీదార్ల, దుర్భోధకుల పిచ్చి ఎర్పులలేని నీచమైన రక్తసిక్తపు పాత్రతో వారు తెగతెంపులు చేసుకునేటట్టు మేం చూస్తాం. ఇకప్పుడు యుద్ధాలు సంభవించే అవకాశం అతి త్వరగా అంతరించిపోతుంది.

8. "యూరప్ ఆర్థిక పరిస్థితులపై మాతో శాంతికి వుండే ప్రభావమా?"

యంత్రాలనూ, గోధుమలనూ, ఫ్లాక్స్‌నార, ఇంకా ఇతర ముడిపదార్థాలనూ మార్పిడి చేసుకోవడం — ఇది యూరప్‌కి ఏమైనా నష్టం కల్గిస్తుందా? లాభంగానే తప్ప మరోవిధంగా వుండదనేది సుస్పష్టమే.

9. "ప్రపంచ శక్తిగా సోవియట్ల భావి అభివృద్ధి గురించి మా అభిప్రాయమా?"

ప్రపంచం సర్వేసర్వత్రా భవిష్యత్తు సోవియట్ వ్యవస్థదే. దీనిని వాస్తవవిషయాలే రుజువుచేశాయి: ఏ దేశంలోనైనా సరే, సోవియట్లను సమర్థించుతూ, లేదా సోవియట్లతో సానుభూతి వ్యక్తంచేస్తూన్నట్టి పాంప్లెట్లు, పుస్తకాలు, కరపత్రాలు, వార్తాపత్రికల సంఖ్యను, మీ యిష్టం, ఏ ప్రతిమూడు మాసాల కాలంలోనైనా సరే లెక్కపెట్టి, ఆ సంఖ్య ఎలా పెరుగుతూందో చూస్తేసరి. మరొక విధంగా వుండేందుకు వీల్లేదు: పట్నవాసపు కార్మికులూ, పల్లెటూళ్లలోని కార్మికులూ వ్యవసాయ కూలీలూ చేతిపనులవారూ, సన్నకారు రైతులు, అనగా కిరాయికి పెట్టుకున్న శ్రమను దోపిడీచేయని రైతులూ — శ్రమజీవులలో బ్రహ్మాండమైన అత్యధికసంఖ్యాకవర్గానికి చెందిన వీరందరూ కూడా తమపై భూస్వాములూ, పెట్టుబడిదార్లూ మోపిన గాటినుండి సోవియట్ వ్యవస్థ తమను విముక్తిచేసి, సర్వాధికారాన్ని తమ చేతిలో పెడుతుందని ఎప్పుడు గ్రహించుకుంటారో అప్పుడు — ప్రపంచం సర్వేసర్వత్రా సోవియట్ వ్యవస్థ విజయాన్ని ఎవరైనా సరే ఎలా వారించగల్గుతారు? దానిని వారించే సాధనం ఏమిటో నాకు మాత్రం తెలియదు.

10. "బాహ్యనుంచి విప్లవప్రతిఘాతక జోక్యం విషయమై ఇంకా రష్యా భయపడాల్సి వుందా?"

దురదృష్టవశాత్తూ భయపడాల్సి వుంది. ఇందుకు కారణం పెట్టుబడిదార్లు తెలివిమాలినవాళ్లూ దురాశాపరులూ కావడమే. ఇటువంటి తెలివిమాలినట్టి దురాశాపూరితమైనట్టి జోక్యపు యత్నపరంపరను వాళ్లు జరిపించి వుండడంచేత, అన్ని దేశాల కార్మికులూ రైతులూ తమ తమ పెట్టుబడిదార్లను పునః పెంచి వృద్ధిలోకి తెచ్చేంతవరకూ ఇది మళ్లీ మళ్లీ జరుగుతుందనే భయం వుండనే వుంటుంది.

11. "అమెరికాతో వ్యాపార సంబంధాలు పెట్టుకుందుకు రష్యా సిద్ధంగానే వుందా అవి అడుగుతున్నారా?"

అవును, సిద్ధంగానే వుంది, ఇతర దేశాలన్నిటితోనూ కూడా. ఈ విషయంలో కొన్ని నిర్దిష్ట షరతులపై రాయితీలను సహితమూ ఇచ్చేందుకు మేము సిద్ధంగా వున్నామనే విషయాన్ని ఎస్తోనియాకు బ్రహ్మాండమైన సౌకర్యాలను కల్గజేస్తూ ఆ దేశంతో మేము స్థాపించుకున్న శాంతే రుజువు చేస్తోంది.

ఫిబ్రవరి 18, 1920

వి. ఉల్యానొవ్ (ఎన్. లెనిన్)

ఇంగ్లీషులో
"New York Evening Journal"
నెం. 12671 లో 1920 ఫిబ్రవరి 21 న
ప్రచురించబడింది.

"ప్రావ్దా" నెం. 112 లో
1950 ఏప్రిల్ 22 న రష్యన్ భాషలో తొలి
సారి ప్రచురించబడింది.

వి.ఇ. లెనిన్, "రచనలు",
4 వ రష్యన్ కూర్పు, 30 వ సంపుటి,
పుటలు 340—342

"DAILY EXPRESS" విలేకరి ప్రశ్నలకు సమాధానం[21].

1. "దిగ్బంధన ఎత్తివేత గురించి మా వైఖరా?"

దానినొక గొప్ప ముందంజగానే భావిస్తున్నాం మేం. అంటాంట్ పెట్టుబడిదారీ ప్రభుత్వాలు మామీద మోపిన యుద్ధంనుంచి బయటికి వచ్చి శాంతియుత పునర్నిర్మాణానికి దాటివెళ్లే అవకాశం మాకిప్పుడు కల్గుతూంది. అన్నిటికంటెనూ మాకిదే ముఖ్యమైన విషయం. డార్డనెల్స్ కోసమూ, వలసల కోసం పెట్టుబడిదార్ల మధ్య సాగిన యుద్ధంవల్ల మొదట్లోనూ, ఆటుతరువాత అంటాంట్ దేశాల పెట్టుబడిదార్లూ రష్యా దేశపు పెట్టుబడిదార్లూ రష్యన్ కార్మికులపై సాగించిన యుద్ధంవల్లనూ నాశనమైపోయిన దేశపుటార్థిక జీవితాన్ని పునరుద్ధరించుకుందుకు సర్వశక్తులనూ వినియోగించుకుంటూ, ఇతర చర్యలతో పాటుగా, దేశాన్నంతనూ విద్యుదీకరణం చేసేందుకు, విజ్ఞానశాస్త్రజ్ఞులూ ప్రవీణులూ కలిసి యేర్పడిన అనేక బృందాల సహాయంతో మేమిప్పుడు ఒక ప్రణాళికను రూపొందించాం. ఈ ప్రణాళికను సాధించేందుకు అనేక సంవత్సరాలు పడుతుందనే అంచనా. విద్యుదీకరణం రష్యాని పునరుజ్జీవింపజేస్తుంది. సోవియట్ వ్యవస్థ ప్రాతిపదికపై విద్యుదీకరణమంటే, మా దేశంలో కమ్యూనిజానికి — దోపిడీదార్లు లేనట్టి, పెట్టుబడిదార్లు లేనట్టి, భూస్వాములు లేనట్టి, వర్తకులు లేనట్టి సంస్కృతీపరమైన జీవితానికి పరిపూర్ణ విజయంతో శంఖుస్థాపన జరుగుతుందన్నమాట.

విద్యుదీకరణ ప్రణాళికను సాధించేందుకు దిగ్బంధన ఎత్తివేత తప్పకుండా సహాయపడుతుంది.

2. "ఎదురుదాడి విరమించేందుకు మిత్రరాజ్యాలు తీసుకున్న నిర్ణయానికి సోవియట్ రాజ్యంయొక్క ఎదురుదాడి క్రియాకలాపాలాపై వుండే ప్రభావమా?"

అంటాంట్ రాజ్యాలూ, వాటి మిత్రులూ, వాటి భృత్యబృందమూ — కోల్చాక్, దెనీకిన్, ఇంకా చుట్టుపక్కల వున్న దేశాల పెట్టుబడిదార్లూ — మామీద దాడిచేశాయి. మేము

ష్వరిమీదా దాడిచేయలేదు. మేమెన్నో భౌతికత్యాగాలు చేయాల్సి వచ్చినప్పటికీ కూడా అందుకు లెక్క చేయకుండానే ఎస్తోనియాతో శాంతి స్థాపించుకున్నాం.

మిత్రరాజ్యాల "నిర్ణయం" వారి చేతల వల్ల ఎప్పుడు ధ్రువపడుతుందా అని ఆత్రంతో కాచుకునున్నాం, కాని మిత్రరాజ్యాల మాటలకూ చేతలకూ ఎక్కడా పొత్తు కుదరదనీ, నిర్ణయాలు కాగితంమీదే వుండిపోతాయనీ వెర్సెయిల్స్ శాంతి సంధియొక్క, దాని అనుషక్తాల యొక్క కథ దురదృష్టవశాత్తూ రుజువుపరచుతూంది.

3. "ప్రస్తుతపు status quo* సోవియట్ విధానానికి సంతృప్తికరంగా వున్నట్టే మేము పరిగణించుతున్నామా?"

అవును, ఎందుచేతంటే రాజకీయాలలో ప్రతి status quo కూడా పాతనుండి కొత్తకి పరివర్తనే. అనేక విషయాల దృష్ట్యా ప్రస్తుతం వున్న status quo యుద్ధంనుంచి శాంతికి పరివర్తనే. ఇటువంటి పరివర్తన మాకు వాంఛనీయమే, కాబట్టి ఆ మేరకు కూడా status quo సంతృప్తికరమైనదనే మేము పరిగణిస్తున్నాం.

4. "మిత్రరాజ్యాల పక్షంనుంచి యుద్ధచర్యల విరమణ విషయంలో మా లక్ష్యాలా?"

ఇదివరకప్పుడే చెప్పినట్టుగా శాంతియుత ఆర్థిక నిర్మాణమే మా లక్ష్యం. అఖిల రష్యా సెంట్రల్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఫిబ్రవరి (1920) సమావేశపు తీర్మానాన్ననుసరించి, దీని విషయమై విద్యుదీకరణను పునాదిగా కల్గిన సవివరమైన ప్రణాళికను విజ్ఞానశాస్త్రజ్ఞుల, సాంకేతికుల కమిషన్ ఒకటి — సరిగా చెప్పాలంటే, కొన్ని కమిషన్లు — ప్రస్తుతం రూపొందించడం జరుగుతూంది.

1920 ఫిబ్రవరి 18 న రచించబడింది.

ఇంగ్లీషున "Daily Express" నెం. 6198 లో 1920 ఫిబ్రవరి 23 న ప్రచురించబడింది.

"ప్రావ్ద", నెం. 112లో 1950 ఏప్రిల్ 22 న రష్యన్ భాషలో తొలి సారి ప్రచురించబడింది.

వి.ఐ. లెనిన్, "రచనలు", 4 వ రష్యన్ కూర్పు, 30 వ సంపుటి, పుటలు 343–344

---

* యథాస్థితి — అనువాదకుడు.